నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 12-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 144 | పేజీలు: 4 | వెల: రూ.1/-

విమాన కూల్చివేతదారులను కఠినంగా శిక్షించాలి

తగినపరిహారం వెంటనే అందచేయాలి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీ డిమాండ్

న్యూఢిల్లీ,జనవరి11(ఆర్ఎన్ఎ): బోయింగ్ విమానం కూల్చివేతకు బాధ్యులైన వారిని ఇరాన్ కఠినంగా శిక్షించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమి జెలన్‌స్కీ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం కూడా ఇవ్వాలన్నారు. దోషులను అంతర్జాతీయ కోర్టు ముందు ప్రవేశపెట్టాలని ఆయన తన ఫేస్‌బుక్ పేజీలో రాశారు. ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడి వల్లే ఉక్రెయిన్ విమానం కూలినట్లు తేలింది. బాధిత కుటుంబాలు క్షమించాలని ఇరాన్ విదేశాంగ మంత్రి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. టెహ్రాన్ విమాన దుర్ఘటనలో 176 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎటువంటి ఆలస్యం జరగకుండా విచారణ పూర్తి చేయాలని, ఉక్రెయిన్‌కు చెందిన 45 మంది నిపుణులకు విచారణ కోసం అనుమతి ఇవ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు తెలిపారు. కెనడా ప్రధాని జెస్టిన్ ట్రూడో కూడా ఇరాన్ ప్రకటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు పారదర్శకంగా ఇరాన్ న్యాయం చేయాలని ట్రూడో కోరారు. ఉక్రెయిన్ విమాన ప్రమాదంలో మరణించిన వారిలో సుమారు 50 మంది కెనడియన్లు ఉన్నారు.

యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రక్కు, ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో మంటలు

ఘటనలో 20 మంది సజీవదహనం

ఉత్తరప్రదేశ్ కనౌజ్ వద్ద దగ్ధం అయిన బస్సు

లక్నో,జనవరి11(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కనౌజ్ జిల్లా చిలోయి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ట్రక్కు, ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 20 మంది సజీవదహనం కాగా మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కనౌజ్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కనౌజ్ ఎస్‌పి అమ్రేంద్ర ప్రసాద్ సింగ్ తెలిపాడు. బస్సులో 43 మంది ప్రయాణికులు గుర్నాయి గంజ్ నుంచి జైపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యా నాథ్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి వెంటనే 50 వేల రూపాయలు విడుదల చేశారు. రెండు వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 41 మంది ఉన్నారు. జైపూర్ నుంచి ఫరూకాబాద్ వెళ్తున్న సమయంలో ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. అయితే ప్రమాదం సజీవదహనమైన ప్రయాణికులను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించనున్నట్లు యూపీ పోలీసులు వెల్లడించారు. ప్రయాణికుల శరీరాలు పూర్తిగా కాలిపోయాయని, ఎముకలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని, కేవలం డీఎన్ఏ పరీక్ష ద్వారా మాత్రమే ఎంత మంది చనిపోయారో నిర్ధారించడం వీలవుతుందని కాన్పూర్ ఐజీ మోహిత్ అగర్వాల్ తెలిపారు. లారీని ఢీకొన్న సమయంలో బస్సులో ఉన్న డీజిల్ ట్యాంక్ పేలి ఉంటుందని, దాని వల్లే భారీగా మంటలు వ్యాపించి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు మృతి చెందడంపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. 'కనౌజ్ దుర్ఘటన తీవ్రంగా కలిచివేసింది. పలువురు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను' అని మోదీ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. కనౌజ్ జిల్లా దేవర్ మార్గ్ వద్ద 45 మంది ప్రయాణికులతో వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు ఒక ట్రక్కును ఢీకొనడంతో రెండు వాహనాలూ మంటల్లో చిక్కుకున్నాయి. స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకుని 25 మంది ప్రయాణికులను కాపాడారు. వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

పొగమంచుతో వరుసగా ఢీకొన్న వాహనాలు

ఉత్తర భారతదేశంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు ప్రభావం వల్ల ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై పొగ మంచు ప్రభావం వల్ల శనివారం ఉదయం ఓ బస్సు మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాద ఘటనలో 12 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ప్రయాణికులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పొగమంచు ప్రభావం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందు వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

క్యూరేటివ్ పిటిషన్లపై 14న విచారణ

న్యూఢిల్లీ,జనవరి11(ఆర్ఎన్ఎ):: నిర్భయ ఇద్దరు దోషుల క్యూరేటివ్ పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ నెల 14వ తేదీన విచారణ చేపట్టనుంది. జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఛాంబర్‌లో అంతర్గతంగా విచారణ చేపట్టనుంది. నిర్భయ దోషులు వినయ్‌శర్మ, ముకేశ్ ఇద్దరూ క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేశారు. 2012 నిర్భయ ఢిల్లీ గ్యాంగ్ రేప్ కేసులో నలుగురు దోషులకు ఈ నెల 22న ఉదయం 7 గంటలకు ఉరిశిక్ష అమలు చేయాల్సిందిగా పటియాల కోర్టు తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

అన్నపూర్ణాలో సంక్రాంతి సంబరాలు

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): అన్నపూర్ణ స్టూడియోలో మూడు రోజుల ముందే సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అన్నపూర్ణ స్టూడియోలో పని చేసే ఉద్యోగుల కోసం ప్రత్యేక బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేశారు. నాగ సుశీల, అమల తదితరులు ఫుడ్ సర్వ్ చేయగా, ఉద్యోగులు ఆరగించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, నాగ చైతన్య, సుమంత్‌తో పాటు పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. నాగ్ ఉద్యోగులతో కలిసి కొద్ది సేపు ముచ్చటించడంతో పాటు ఫోటోలు కూడా దిగారు.

చెట్టును ఢీకొన్న కారు: నలుగురు దుర్మరణం

భువనేశ్వర్,జనవరి11(ఆర్ఎన్ఎ): ఒడిశా రాష్ట్రం నయాగఢ్ జిల్లాలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శరణ్‌కూల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరడ గ్రామం శివారులో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. మృతులు చిరాంజిబ్, అద్యితా సాహూ, మధుస్మిత, డ్రైవర్ సంతోష్ నాయక్‌గా గుర్తించారు. భువనేశ్వర్ నుంచి నయగఢ్ కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

స్నానం చేయని భర్తతో వేగలేకున్నా విడాకులు కోరిన మహిళ

పాట్నా,జనవరి11(ఆర్ఎన్ఎ): ప్రతి రోజు భర్త స్నానం చేయడం లేదు, గడ్డం గీసుకోవడంలేదని విడాకులు కావాలని భార్య కోర్టులో కేసు వేసిన సంఘటన బిహార్‌లోని వైశాలి జిల్లాలో జరిగింది. మహిళ కమిషన్ సభ్యురాలు ప్రతిమ సిన్హా తెలిపిన వివరాల ప్రకారం... 2017లో సోని దేవి అనే యువతి మనీష్ రామ్‌ను పెళ్లి చేసుకుంది. భర్త ఇంట్లో శుభ్రంగా ఉండడం లేదని, బ్రష్ సరిగ్గా చేసుకోవడం లేదని, స్నానం చేయడం లేదని, గడ్డం గీసుకోవడంలేదని సోని మహిళా కమిషన్‌ను కలిసి తనకు భర్తతో విడాకులు కావాలని కోరింది.

దీంతో మహిళ కమిషన్ సభ్యులు అవాక్కయ్యారు. పిచ్చి కారణాలతో భర్తను వదించుకోవాలని సదురు మహిళ చూస్తోందని కమిషన్ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భర్త మనీష్ మాత్రం తన భార్యతో కలిసి ఉంటానని తెలిపాడు. దంపతులను కలిసి ఉండేందుకు కౌన్సిలింగ్ ఇస్తామని ప్రతిమా తెలిపారు. పెళ్లిలో మనీష్‌కు బంగారం, డబ్బులు, కట్న కానుకల కింద ఇచ్చామని అవి ఇప్పించాలని మహిళా కమిషన్‌ను భార్య కోరింది.

ఉద్దేశ పూర్వకంగా కూల్చలేదు..

- మానవ తప్పిదంవల్లే అలా జరిగింది
- బాధ్యులైన వారిని శిక్షిస్తాం
- ఉక్రెయిన్ విమాన ప్రమాదంపై ఇరాన్ ప్రకటన
- ప్రమాదంలో మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఇరాన్ మంత్రి

టెహ్రాన్, జనవరి11(ఆర్ఎన్ఎ) : ఉక్రెయిన్ విమానాన్ని తాము ఉద్దేశపూర్వకంగా కూల్చలేదని, మానవ తప్పిందం వల్లే అలా జరిగిందని ఇరాన్ ప్రకటించింది. ఇరాక్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై దాడి జరిగిన కొన్ని క్షణాల వ్యవధిలోనే టెహ్రాన్ నుంచి బయలుదేరిన ఉక్రెయిన్ విమానం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో 176 మంది మరణించారు. అయితే ఆ విమానాన్ని కూల్చలేదని తొలుత ప్రకటించిన ఇరాన్.. ఇప్పుడు తన తప్పును అంగీకరించింది. ఉద్దేశ పూర్వంగా ఉక్రెయిన్ విమానాన్ని కూల్చలేదని ఇరాన్ స్పష్టం చేసింది. మానవ తప్పిదం వల్ల ఆ ప్రమాదం జరిగినట్లు ఇరాన్ టీవీ శనివారం ప్రకటన చేసింది. మిలిటరీ యూనిట్‌కు సమీపంగా ప్రయాణిస్తున్న కారణంగా అనుకోకుండా ఆ విమానాన్ని మిస్సైల్‌తో పేల్చినట్లు ఇరాన్ సైనిక విచారణలో తేలిందని తెలిపింది. అమెరికా దుస్సాహసం వల్ల ఏర్పడిన విపత్తులో మానవ తప్పిందం జరిగిందని, దాని వల్లే విమాన కూల్చివేత ఘటన జరిగినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి జావద్ జారిఫ్ తన ట్విట్టర్‌లో తెలిపారు. బాధ్యులైన వారిని శిక్షిస్తామని ఇరాన్ తెలిపింది. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఇరాన్ మంత్రి సంతాపం తెలిపారు. ప్రజలకు, బాధిత కుటుంబాలకు, ప్రభావానికి గురైన అన్ని దేశాలకు క్షమాపణలు చెబుతున్నట్లు తన ట్వీట్‌లో వెల్లడించారు. మిలటరీ కమాండర్ సులేమానీని అమెరికా హత్య చేసిన తర్వాత.. ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. అమెరికా సైనిక స్థావరాలపై దాడి జరిగిన రాత్రే.. టెహ్రాన్‌లో అనూహ్య రీతిలో ఉక్రెయిన్‌కు చెందిన విమానం కుప్పకూలింది. టెహ్రాన్ నుంచి టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే అది ముక్కలు ముక్కలైంది. ఆ విమానం గాలిలో ఉన్నప్పుడే మంటలు అంటుకున్నట్లు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ విమానాన్ని ఏ క్షిపణి కూడా కూల్చలేదని తొలుత ఇరాన్ బుకాయించింది. కానీ అంతర్జాతీయంగా ఆ దేశంపై వత్తిడి పెరిగింది. కెనడా దేశానికి చెందిన ఎక్కువ ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడంతో.. ఆ దేశం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నది. క్షిపణులతో ఇరానే ఆ విమానాన్ని కూల్చినట్లు కెనడా ప్రకటించింది. ఆ తర్వాత ఆ ఘటనకు సంబంధించిన కొన్ని వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. బ్లాక్ బాక్సులు అమెరికాకు ఇచ్చేది లేదన్న ఇరాన్.. చివరకు తన తప్పును ఒప్పుకున్నది.

ఎన్నికల సంఘం పనితీరు భేష్

డెమోక్రసీ అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఎన్నికల పక్రియ చాలా గొప్పదని గవర్నర్ తమిళ సై సౌందర్యరాజన్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో అది కీలకభూమిక పోషిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమర్థవంతంగా నిర్వహించిందన్నారు. ఇందుకుగాను తెలంగాణ ఎన్నికల సంఘాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశంసలు కురిపించారు. నగరంలోని తామామతి బారాదరిలో తెలంగాణ స్టేట్ డెమొక్రసీ అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురికి అవార్డులను అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ.. ఎన్నికల విధుల నిర్వహణ అంత సులువు కాదన్నారు. స్థానిక సంస్థల్లో పోలింగ్ శాతం ఎక్కువగా నమోదవుతోంది. ఇందుకుగాను తెలంగాణ ఎన్నికల సంఘాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఎన్నికల పక్రియ చాలా గొప్పదని గవర్నర్ కొనియాడారు. స్థానిక సంస్థల్లో ప్రజలే సెలబ్రిటీలని గవర్నర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, పలు రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులు పాల్గొన్నారు.

రేపే కేసీఆర్, జగన్‌ల భేటీ

- రాజధాని ఆందోళన సమయంలో ఆసక్తికరంగా భేటీ
- ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలు కొలిక్కి వచ్చేనా?
- ఇద్దరు సీఎంల భేటీ రెండురాష్ట్రాల్లో ఆసక్తికర చర్చ

హైదరాబాద్, జనవరి11(ఆర్ఎన్ఎ) ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ సీఎం కేసీఆర్ మరోసారి భేటీ కాబోతున్నారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో వీరి భేటీ జరగనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా అమరావతిలో రాజధాని తరలింపుపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యతన సంతరించుకుంది. అమరావతి రాజధాని శంకుస్థాపన సమయంలో తెలంగాణ సీఎం కేసీఆర్‌సైతం పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి తన సహకారం అందిస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరువురి సీఎంల మధ్య రాజధానిపై చర్చజరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమరావతి లోనే ఏపీ రాజధాని నిర్మాణం జరిగితే హైదరాబాద్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితి అనే వాదన వినిపిస్తుంది. హైదరాబాద్‌కు అమరావతి దగ్గరగా ఉండే ప్రాంతం. దీంతో ఎక్కువ మంది హైదరాబాద్ నుంచి అమరావతి షిఫ్ట్ అయ్యేందుకు వెనుకాడరు. అదే విశాఖపట్టణం అయితే హైదరాబాద్ నుంచి వెళ్లాలంటే కష్టం. దీంతో హైదరాబాద్‌లోని ఏపీ ప్రాంత వాసులు తరలిపోకుండా ఉండలాంటే అమరావతి కంటే విశాఖపట్టణం రాజధానిగాఉంటేనే మంచిదనే భావన అందరిలో ఉంది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌సైతం ఏపీ రాజధానిని విశాఖపట్టణం తరలించడానికే జగన్‌కు సలహాఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇక మీద తెలుగు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు ఉన్నాయి. ఈ భేటీలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. విభజన చట్టం, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రధానంగా ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగుల విభజన సమస్యలు, శ్రీశైలానికి గోదావరి నీళ్ల తరలింపుపై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. గోదావరి–కృష్ణా అనుసంధానంపై ఇప్పటికే ఇద్దరు సీఎంలు చర్చించారు.. కానీ ఎలాంటి క్లారిటీకి రాలేకపోయారు. ఈ భేటీలో ఇదే అంశంపై ఫోకస్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాదు రాజధానిపై రగడ జరుగుతున్న సమయలోనే ఈ సమావేశం జరగనుండటంతో.. ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఇప్పటికే రెండు, మూడుసార్లు సమావేశమయ్యారు. విభజన చట్టం, పెండింగ్ సమస్యలపై చర్చించారు. కొన్నిటికి పరిష్కారం దొరికినా.. మరికొన్ని మాత్రం అలాగే పెండింగ్ ఉండిపోయాయి. దీంతో ఈ సమస్యల్ని వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని భావిస్తున్నారు. మరి ఈ భేటీలో సీఎంలు ఎలాంటి చర్చలు జరుపుతారన్నది ఆసక్తికరంగా మారింది. సోమవారం భేటీ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం అమరావతి నుంచి బయల్దేరి భాగ్యనగరానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి మూడు రోజుల పాటూ హైదరాబాద్‌లోనే ఉంటారు.

మోడలే తమ కుమారులను ట్రాప్ చేసింది

- రూ.20 లక్షలు డిమాండ్ చేసింది
- మగ పిల్లలను ట్రాఫ్ చేసి, బెదిరింపులకు దిగిన ఆడపిల్లలపై చర్యలుండవా?
- నిందితుల తల్లుల ఆవేదన

హైదరాబాద్, జనవరి11(ఆర్ఎన్ఎ) : హైదరాబాద్ నగరంలో కలకలంరేపిన మోడల్ హత్యాచారం కేసులో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. డబ్బుకోసమే యువతి నాటకాలు ఆడుతుందని, తమ కుమారులు ఎలాంటి తప్పుచేయలేదని, వారిని మోడలే ట్రాఫ్ చేసి బెదిరింపులకు దిగిందని నిందితులుగా పేర్కొంటున్న రిషి, నిఖిల్‌రెడ్డి తల్లులు వాపోయారు. జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన రిషి, నిఖిల్ రెడ్డి తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ వెంకటగిరి ప్రాంతానికి చెందిన మోడల్ (21) శుక్రవారం మీడియా ముందుకు వచ్చారు. వారిపై ఈనెల 7న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయితే, పోలీసులు కేసు నమోదు చేయకపోగా, తనదే తప్పన్నట్టుగా చెప్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుతో విసిగిపోయి మీడియా ఎదుటకు వచ్చినట్టు ఆమె వెల్లడించారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని బంజారాహిల్స్ ఏసీపీ కేఎన్‌రావు పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. మోడలే తమ కుమారులను ట్రాప్ చేసిందని రిషి, నిఖిల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆరోపించారు. రిషి, నిఖిల్‌రెడ్డిని మోడలే ట్రాప్ చేసిందని రిషి తల్లి ఆదిలక్ష్మీ, నిఖిల్‌రెడ్డి తల్లి సునీత వాపోయారు. తప్పుడు కేసు పెట్టి రూ.20 లక్షలు డిమాండ్ చేసిందని

ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆడపిల్ల కదా అని కేసు నమోదు చేశామని పోలీసులు అంటున్నారని, మగ పిల్లలను ట్రాఫ్ చేసి బెదిరింపులకు పాల్పడితే...ఆడపిల్లలపై కేసులు, చట్ట ప్రకారం చర్యలు ఉండవా అని వారు ప్రశ్నించారు. మా కుమారులు ఎలాంటి తప్పు చేయలేదని, తప్పంతా మోడల్‌దే నని వారు మీడియాతో ఎదుట తెలిపారు. మోడల్ తన కొడుకుతో పెళ్లికి కూడా సిద్ధపడిందని రిషి తల్లి ఆదిలక్ష్మి తెలిపారు. మైనర్‌తో వివాహం కుదరదని చెప్పామని, రెండేళ్ల తర్వాత రిషి మేజర్ అవుతాడని, అప్పుడు మీ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేస్తామని కూడా చెప్పామని తెలిపారు. తన కొడుకు తప్పు చేశాడని తేలితే ఏ శిక్ష విధించినా అడ్డు చెప్పమని, మోడల్ మా అబ్బాయిని ఎలా ట్రాప్ చేసిందో అన్ని ఆధారాలు ఉన్నాయని వారు తెలిపారు.. ఏసీపీకి ఫిర్యాదు చేస్తామని, డబ్బుకోసం మోడల్ తల్లిదండ్రులు కూడా దిగజారారని, వారు కూడా 10 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోమన్నారని రిషి తల్లి వెల్లడించారు.

అటు..ఇటుగా దర్గ దయాకర్ రెడ్డి

పార్టీ మారి మళ్లీ పాతగూటికి చేరిక

మంత్రి మల్లారెడ్డి చక్రం తిప్పడంతో మారిన మనసు

మేడ్చల్,జనవరి11(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలు ఊసరవెల్లి రాజకీయాలకు వేదికవుతున్నాయి. మేడ్చెల్ జిల్లాలో జరిగిన ఘటన అవకాశవాద రాజకీయాలకు పరాకాష్టగా నిలిచింది. టికెట్ వేటలో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడం సహజమే అయినా ఎంపీ సమక్షంలో ఉదయం ఒక పార్టీలో చేరి.. తర్వాత పార్టీ మార్చి.. తిరిగి సాయంత్రం మంత్రి సమక్షంలో ఉదయం చేరిన పార్టీ కండువా కప్పుకోవడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ నీయాంశమైంది. దర్గ దాయకర్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్ అయ్యింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో జింపింగ్ జిలానీలపై ఆయా పురపాలికల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఫీర్జాదిగూడ గ్రామంగా ఉన్నప్పుడు ఉప సర్పంచ్‌గా ఉన్న దర్గ దయాకర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా పేరుంది. ఫీర్జాదిగూడ కార్పొరేషన్‌లో టీఆర్ఎస్ బలోపేతానికి బాగా పనిచేశారన్న గుర్తింపు కూడా అతడికుంది. అయితే, ఏడాది కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌లో నెలకొన్న అధిపత్య పోరుతో అప్పటి ఎంపీ, ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డికి అనుకూలంగా వ్యవహరించారు.

పార్లమెంట్ ఆదేశిస్తే..

పీవోకే మనదే అవుతుంది

- ఆపరేషన్ పీవోకే నిర్వహించేందుకు తాము సిద్ధం
- రాజ్యాంగ విలువల స్ఫూర్తితోనే పనిచేస్తాం
- ఆర్మీ చీఫ్ నరవాణెళి

న్యూఢిల్లీ, జనవరి11(ఆర్ఎన్ఎ) : పీవోకే వెనక్కి తెచ్చుకోవాలని పార్లమెంట్ కోరితే, ఆ ప్రాంతం కూడా మనదే అవుతుందని ఆర్మీ చీఫ్ నరవాణెళి స్పష్టం చేశారు. నెలవారీ ప్రెస్‌మీట్‌లో భాగంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)పై కొత్త ఆర్మీ చీఫ్ ముకుంద్ నరవనే స్పష్టమైన ప్రకటన చేశారు. పీఓకే మనదేనని, ఆపరేషన్ పీఓకే నిర్వహించేందుకు తాము సిద్ధమేనని అన్నారు.

పీఓకే వెనక్కి తెచ్చుకోవాలని పార్లమెంటు కోరితే, ఆ ప్రాంతం కూడా మనదే అవుతుందన్నారు. ఆ మేరకు తమకు ఎప్పుడు ఉత్తర్వులు అందితే అప్పుడు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఎల్ఓసీ వద్ద పాక్ ఆర్మీ, ఉగ్రవాదుల నుంచి ఎదురవుతున్న ముప్పును ఆర్మీ చీఫ్ ప్రస్తావిస్తూ, ఎల్ఓసీ వెంబడి అత్యంత అప్రమత్తత పాటిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఇంటెలిజెన్స్ అలెర్ట్‌లు అందుతుంటాయని, చాలా సీరియస్‌గానే వీటిని పరిగణించి పాకిస్థాన్ ప్రత్యేక బలగాలైన 'బ్యాట్' చర్యలకు ప్రతిచర్యలు చేపడుతూ వాటిని సమర్థవంతంగా తిప్పికొడుతుంటామని చెప్పారు. పాకిస్థాన్ సరిహద్దుల్లో బలగాల రీ–బ్యాలెన్స్‌పై మాట్లాడుతూ.. తూర్పు, పశ్చిమ సరిహద్దులు రెండింటికీ సమప్రాధాన్యం ఉన్నందున రీ–బ్యాలెన్సింగ్ అనేది అవసరమేనని అన్నారు. భారత ఆర్మీ ప్రాధాన్యతలపై మాట్లాడుతూ, చొరబాట్లను తిప్పికొట్టడం తాత్కాలిక ప్రాధాన్యతాంశమైతే, సాంప్రదాయ యుద్ధం అనేది దీర్ఘకాలిక ప్రాధాన్యతాంశం అవుతుందని, అందుకు తాము సన్నద్ధంగా ఉంటామని చెప్పారు. ఇండియా, చైనాల మధ్య ప్రతిపాదిత హాట్‌లైన్ అంశాన్ని ప్రస్తావిస్తూ, త్వరలోనే ఇండియన్ డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్‌కు, చైనా వెస్టన్ కమాండ్‌కు మధ్య హాట్‌లైన్ ఏర్పాటు జరుగుతుందన్నారు. రాజ్యాంగ విలువల స్ఫూర్తితోనే పనిచేస్తామని నరవాణెళి తెలిపారు.

శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు

గుజరాత్‌లో భారీ అగ్నిప్రమాదం: ఆరుగురు మృతి

అహ్మదాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): గుజరాత్ వడోదరలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వడోదరలోని పద్రా తాలుకాలో గల ఇండస్ట్రియల్ , మెడికల్ గ్యాస్ తయారీ పరిశ్రమలో పేలుడు సంభవించింది. ఎయిమ్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో శనివారం జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు ఆరుగురు మృతి చెందారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ పరిశ్రమ ఆక్సిజన్, నైట్రోజన్, ఆర్గాన్, కార్బన్ డై ఆక్సైడ్ ఇతర వాయువులను తయారు చేస్తుంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలు

నేటినిజం
ఆదివారం 12-1-2020

మానవుడు ప్రకృతిలో భాగం..

దశాబ్దాల తరబడి నరికివేతకు గురైన మహా వృక్షాల స్థానంలో కొత్త కొత్త మొక్కలు మారాకు తొడుగుతున్న దృశ్యం భరత భూమి నలుచెరగులా విస్తరిస్తుండడం శివంకరం, శుభంకరం. అడవి ప్రతీక.. ప్రకృతి పతాక.. సృష్టి స్థిత సతత హరిత సంతులనం ప్రగతికి నిజమైన భూమిక. ఈ సంతులనం వృక్షజాలానికీ, జంతుజాలానికీ మధ్యగల శాశ్వతమైన అనుసంధానం. జీవజాలంలో మానవుడు సర్వోన్నతుడు, విచక్షణ వంతుడు, సంస్కార శోభితుడు, విజ్ఞాన విగ్రహుడు.. అందువల్ల సృష్టిగత సంతులనం మానవుని విచక్షణ వికాసంతో ముడివడి ఉంది. ఇలా ముడివడి ఉండడం అనాది జీవన వాస్తవం. అనంతమైన భౌతిక, బౌద్ధిక అభ్యుదయం. భారతదేశంలోని 'విచక్షణ' ఈ ప్రాకృతిక సంతులన పరిరక్షణకు,పరిపోషణకు దోహదం చేసింది. ప్రకృతిని ఆరాధించడం హైందవ జాతీయ సనాతన సంస్కారమైంది. ఈ సంస్కార ప్రభావం పంచభూతాల నుంచి ప్రసరించింది, పంచభూతాలను పరిరక్షించింది. మానవుడు ప్రకృతిలో భాగం, ప్రకృతి కంటె భిన్నమైన వాడు కాదు. ప్రకృతి సమగ్ర సృష్టిలో భాగం, సృష్టి కంటె భిన్నం కాదు.

ఈ సృష్టిగత వాస్తవం హైందవ సమాజ స్థితం కావడం ప్రకృతి పరిరక్షణకు దోహదం చేసింది. అందువల్లనే భారతీయులు అనాదిగా నేలతో, నీటితో, నిప్పుతో, నిరంతర జీవన శ్వాస అయిన గాలితో, నింగితో ఏకాత్మ భావ భరితులయ్యారు. నేల, నీరు, నిప్పు, గాలి, నింగి పంచభూతాలు. సృష్టి పంచభూతాల సమాహారం. మానవుడు, సకల జీవరాశులు పంచభూతాల సమాహారం. ఇదీ అద్వైతం. సృష్టికర్త భూతపతి. పంచభూతాలలో వ్యాపించిన పరమశక్తి.. పంచభూతాలను పెంపొందించిన మానవుడు పరమశక్తిగా ఎదిగాడు. పరమశక్తిగా భాసించాడు. 'శివో భూత్వా శివం యజేత్'– సృష్టిగా మారి సృష్టికర్తగా మారి సృష్టిని, సృష్టికర్తను పూజించాలి– అన్నది జీవసత్యం.

విదేశీయులు భరతభూమి పట్ల మమకారం లేని వారు. ప్రధానంగా బ్రిటన్ దురాక్రమణదారులు మన దేశంపై పెత్తనం చెలాయించిన కాలంలో ఈ ప్రకృతి పరిరక్షణ ప్రవృత్తి క్రమంగా నశించింది. అవసరాల కోసం కాక అత్యాశతో కలపను మన దేశం నుంచి తరలించడం మొదలైంది. వృక్షాలను నరికివేయడంతోపాటు, అటవీ జంతువులను నిరంతరం హత్య చేయడం జీవన విధానంగా మారింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో లక్షలాది వృక్షాలను నరికివేసి కలపను బ్రిటన్‌కు తరలించడం పట్ల దేశ ప్రజలు నిరసనలను తెలపడం చరిత్ర. స్వాతంత్ర్య ఉద్యమకారులు చెట్లను కౌగిలించుకొని 'హత్యాకాండ'ను ఆపడానికి యత్నించడం చరిత్ర. ఈ అటవీ హననం కారణంగా వనచర జంతుజాతులు అంతరించాయి.

గడ్డి దొరకని ఆవులు, పాడిపశువులు ఆకలితో అలమటించాయి, వధ్యశాలకు తరలిపోయాయి. అడవుల్లో లభించే పచ్చని ఆకులు, ఆవు పేడ అనాదిగా వ్యవసాయ భూమికి ఆహారం! అడవులు, ఆవులు చాలావరకూ అంతరించిపోవడంతో సహజమైన ఎరువులు దొరకని వ్యవసాయ భూమి నిర్జీవ క్షేత్రంగా మారింది.

సాయన విషాలు కలిసిన కృత్రిమ ఎరువుల వాడకం వల్ల భూమి ఉపరితలం, భూగర్భజలం, మానవుల, జంతువుల ఆహారం కలుషితమై పోయాయి, పోతున్నాయి. పుడమిని పరిశుభ్రం చేయగలిగిన నీరు స్వచ్ఛతను కోల్పోయి విషద్రవంగా మారిపోయింది. పారిశ్రామిక వాటికల కోసం లక్షల ఎకరాల అడవులు విధ్వంసమయ్యాయి, నదుల నీరు తాగడానికి మాత్రమే కాదు, తాకడానికి సైతం పనికిరాని ప్రాకృతిక వైపరీత్యానికి గురికావడానికి కారణం అడవుల విధ్వంసం. సుగంధాన్ని పంచ ఎర్రచందనం వృక్షాలు నేలకొరిగిపోయాయి, కలపగా మారి విదేశాలకు తరలిపోయాయి. పులుల చర్మాలు, గోళ్లు, ఏనుగుల దంతాలు చైనా మందుల ఉత్పత్తి కేంద్రాలకు చేరిపోయాయి..

ఈ దుస్థితిని నిరోధించడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు చేపట్టిన జలరక్షణ, వృక్షరక్షణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నట్టు ఇపుడు ధ్రువపడింది. 'హరిత హారం' పథకం తదితర 'వన' చర్యల కారణంగా తెలంగాణలో గత రెండేళ్లలో అటవీ విస్తీర్ణం ఐదువందల అరవై ఐదు చదరపు కిలోమీటర్ల మేర పెరిగిందట! ప్రస్తుతం తెలంగాణలో ఇరవై నాలుగు శాతం భూభాగంలో, ఆంధ్రప్రదేశ్‌లో ఇరవై మూడు శాతం భూభాగంలో అడవులు విస్తరించి ఉన్నాయట. ఈ పెరుగుదల తర్వాత మొత్తం దేశంలో అటవీ భూమి ఇరవై ఒక్క శాతం నుంచి ఇరవై రెండు శాతానికి పెరగడం హరిత పథ ప్రస్థానంలో వర్తమాన 'ప్రగతి పదం'.. అటవీ రక్షణ భారతీయత, అటవీ విధ్వంసం 'ప్రపంచీకరణ'.. భరతమాత హరిత చేలంపై పడిఉన్న 'చిరుగులు' మాసిపోయేదెప్పుడు? అడవుల శోభలు యథాపూర్వంగా వికసించేదెలా?

దరిద్రనారాయణుడి సేవే పరమార్థం

–జిజ్ఞాసే వివేకానందుడికి ప్రేరణ

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): శ్రద్ధ, నిస్వార్థమే శిష్యరికానికి గీటురాళ్లని, దరిద్ర నారాయణసేవే పరమధర్మమని వివేకానందుడు అన్నారు. మానవాళికి చైతన్యదీప్తిగా స్వామి వివేకానంద విశ్వవిఖ్యాతి పొందినాడు. కర్మ, భక్తి, రాజ, జ్ఞాన యోగాలపై ఆయన చేసిన రచనలు ఆత్మశక్తిని వెలికితీసే ఆయుధాలు. గాంధీ లాంటి అహింసా మూర్తులకూ, సుభాష్ చంద్రబోస్, అరవింద్ ఘోష్, జతిన్‌దాస్‌లాంటి అతివాదులకూ వివేకానందుడి మాటలే బాటలయ్యాయి. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు.. అంటాడు. ప్రాచీన కాలపు గ్రీసులో సోక్రటీసు గొప్ప గురువు. ప్లేటో గొప్ప శిష్యుడు. గురువంటే రామకృష్ణుడు. శిష్యుడంటే వివేకానందుడు. భారతదేశాన్ని చదవాలంటే వివేకానందుణ్ని చదివితే చాలు. రామకృష్ణ పరమహంస వద్ద నాలుగేళ్ల శుశ్రూషలో నరేంద్రుడు నేర్చుకున్న ఆదర్శాలే తరవాత అతడిని మహనీయుడిగాతీర్చిదిద్దాయి. ప్రతి మతంలోను,ప్రతి సిద్ధాంతం లోను, ఎంతోకొంత మంచి వుంటుంది. సోదర ప్రేమ గురించి ప్రసంగాలు మాని, ఆ ప్రేమను కార్యరూపంలో ప్రదర్శించండి. త్యాగ, సాక్షాత్కారాలను పొందినవాడే ప్రపంచంలోని సర్వమతాలలోని ఏకత్వాన్ని దర్శించగలడు. వ్యర్థ వాదాలకు ఆస్కారం లేదని గ్రహించాలని సూచించిన మహానుభావుడాయన. బ్రిటీషు పరిపాలనలోని భారతదేశంలో ఉన్న బెంగాలు ప్రిసిడెన్సీలో ఒక ఉన్నత కుటుంబానికి చెందిన వంశంలో 1863 జనవరి 12న నరేంద్ర నాథుడు జన్మించాడు. నరేంద్రుడు ఆటలలోనూ, చదువులో కూడా ముందుండేవాడు. అతను ఏకసంథాగ్రాహి. పాఠాన్ని ఒకసారి చదివితే మొత్తం గుర్తుంచుకునేవాడు. అతని జ్ఞాపకశక్తి అమోఘమైనది. 1880 వరకు మెట్రిక్యులేషన్ పరీక్ష, ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణుడై కళాశాలలో చేరాడు. బాలుడిగా ఉన్నపుడు నరేంద్రుడు చాలా ఉల్లాసంగా, చిలిపిగా ఉండేవాడు. సన్యాసుల పట్ల యోగుల పట్ల అమితమైన ప్రేమను కనబరిచేవాడు. వారు ఏదడిగినా సరే లేదనకుండా ఇచ్చేసేవాడు. పుట్టగానే పువ్వు పరిమళిస్తిందన్నట్లుగా చిన్నప్పటి నుంచే అతనికి నిస్వార్థ గుణం, ఔదార్య గుణాలు అలవడ్డాయి. రోజు రోజుకూ అతని జ్ఞాన తృష్ణ అధికంకాగా, దైవం గురించి తెలుసుకోవాలని పరమ ఆసక్తితో ఉండేవాడు. చరిత్ర,సైన్సు తోపాటు పాశ్చాత్య తత్వశాస్త్రాన్ని కూడా ఔపోసన పట్టాడు. అలా చదువులో ముందుకెళుతున్న కొద్దీ అతని మదిలో అనుమానాలు, సందేహాలు, అస్పష్టత ఎక్కువ కాసాగినాయి. అప్పుడు అతను బియ్యే పరీక్షకు తయారవుతున్నాడు. 1884లో బియ్యే పాసయ్యాడు. అతని స్నేహితుడొకడు పార్టీ ఏర్పాటు చేశాడు. ఆ పార్టీలో నరేంద్రుడు పాట పాడుతుండగా తెలిసింది పిడుగు లాంటి వార్త. తండ్రి మరణించాడని. వెనువెంటనే ఆకుటుంబాన్ని పేదరికం ఆవరించింది. అప్పులిచ్చిన వాళ్ళు వేధించడం మొదలుపెట్టారు. కొద్దిమంది న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. నరేంద్రుడు ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరిగాడు. బట్టలు మాసిపోయి చిరిగిపోయాయి. రోజుకొకపూట భోజనం దొరకడం కూడా గగనమైపోతుంది. చాలా రోజులు ఆయన పస్తులుండి తల్లికి, చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు తిండి పెట్టేవాడు. వారితో తను స్నేహితులతో కలిసి తిన్నట్లు అబద్ధం చెప్పేవాడు. కొన్నిసార్లు ఆకలితో కళ్ళు తిరిగి వీధిలో పడిపోయే వాడు. ఇంత దురదృష్టం తనను వెన్నాడుతున్నా ఎన్నడూ భగవంతుని మీద విశ్వాసం కోల్పోలేదు. తరువాత నరేంద్రుడు కొద్దిరోజులపాటు విద్యాసాగర్ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాడు. ఇప్పుడు కుటుంబానికి కనీసం తినడానికి తిండైనా దొరుకుతున్నది. బోధకుడిగా పనిచేస్తూనే తన న్యాయ విద్యను కొనసాగించాడు. గురువుగారి ఆరోగ్యం క్షీణించింది. ఆయనకు గొంతు క్యాన్సర్ సోకింది. నరేంద్రుడు తన ఉద్యోగం, చదువు రెండు మానేసి గురు శుశ్రూషలో మునిగిపోయాడు. అలా మూఢ నమ్మకాలన్నింటినీ విడిచి పెట్టినప్పటికీ సత్యాన్ని మాత్రం కనుగొనలేకపోయాడు.

కన్నడ రచయిత చిదానందమూర్తి మృతి

–సంతాపం తెలిపిన సిఎం యెడ్యూరప్ప

బెంగళూరు,జనవరి11(ఆర్ఎన్ఎ): ప్రముఖ కన్నడ విద్యావేత్త, చరిత్రకారుడు, పరిశోధకుడు, రచయిత ఎం.చిదానంద మూర్తి శనివారం తెల్లవారుజామున బెంగళూరులో కన్నుమూశారు.

ఆయన వయస్సు 88 సంవత్సరాలు. వయోభారం కారణంగా తలెత్తిన సమస్యలతో కొద్దికాలంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిదానందం మూర్తి తెల్లవారుజామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. కన్నడ శాసనాలు, ప్రాచీనత్వం విషయంలో చిదానంద మూర్తి అవిరళ కృషి చేశారు. 2008లో భారత ప్రభుత్వం కన్నడ భాషకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా ఇవ్వడం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. హిందూ–రైట్ వింగ్ ఛాంపియన్‌గా కూడా ఆయన పేరు తెచ్చుకున్నారు.

హంపి కళాఖండాలను కాపాడాలంటూ ఆయన చేపట్టిన ప్రచారం విస్తృత ప్రాచుర్యం పొందింది. మూర్తి డిమాండ్ మేరకే హైదరాబాద్ కర్ణాటక పేరును కల్యాణ్ కర్ణాటకగా ముఖ్యమంత్రి బీఎస్.యడియూరప్ప ఇటీవల మార్చారు. మేధావిగా, పరిశోధకుడుగా, చరిత్రకారుడుగా కన్నడ భాషా పరిరక్షణకు చిదానంద మూర్తి విశేష సేవలందించారని, చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన లేని లోటు భర్తీ కాదని ముఖ్యమంత్రి యడియూరప్ప తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. హంపీ కట్టడం పరిరక్షణలో ఆయన పాత్ర, కన్నడ భాషకు క్లాసికల్ లాంగ్వేజ్ గుర్తింపు రావడానికి చేసిన కృషి బహుదా ప్రశంసనీయమని ఆ ట్వీట్‌లో సీఎం గుర్తుచేసుకున్నారు.

అమిత్‌షా పేరుతో గవర్నర్‌కు ఫోన్

ఐఏఎఫ్‌లో వింగ్ కమాండర్ కుల్దీప్ భగాలే అరెస్ట్

న్యూఢిల్లీ,జనవరి11(ఆర్ఎన్ఎ): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సీనియర్ అధికారిని మధ్యప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. కుల్దీప్ భగాలే ఐఏఎఫ్‌లో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు.

ప్రస్తుతం ఐఏఎఫ్ హెడ్‌క్వార్టర్స్ ఢిల్లీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. తనను తాను కేంద్ర హోంమంత్రి అమిత్ షా గా పేర్కొంటూ మధ్యప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ లాల్జీ టాండన్‌కు ఫోన్ చేశాడు. జబల్‌పూర్‌లోని మెడికల్ యూనివర్సిటీకి తన స్నేహితుడిని వైస్ ఛాన్సలర్‌గా నియమించాల్సిందిగా పేర్కొన్నాడు. శుక్లా ఫోన్‌లో అమిత్ షా పీఏగా పేర్కొన్నాడు. చంద్రేశ్ కుమార్ శుక్లా.. కుల్దీప్ భగాలే ఇరువురు స్నేహితులు. మెడికల్ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ నియామకం నిమిత్తం నోటిఫికేషన్ వెలువడింది. ఈ పోస్టుకు శుక్లా దరఖాస్తు చేశాడు. కాగా ఏవరైనా రాజకీయ నాయకుడు సిఫార్సు చేస్తే తనకు వీసీగా అవకాశం వస్తదని తన స్నేహితుడు కుల్దీప్ భగాలేకు చెప్పాడు. దీంతో ఇరువురు పథకం ప్రకారం ఒకరు అమిత్ షాగా మరొకరు అమిత్ షా పర్సనల్ అసిస్టెంట్‌గా పేర్కొంటూ గవర్నర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఫోన్ కాల్‌పై ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఎస్టీఎఫ్ అధికారులు కుల్దీప్ భగాలే తోపాటు భోపాల్‌కు చెందిన అతడి స్నేహితుడు డెంటిస్ట్ చంద్రేశ్ కుమార్ శుక్లాను అరెస్ట్ చేశారు.

ప్రపంచాన్ని జాగృతం చేసిన వివేకానందుడు

హైదరాబాద్, జనవరి 11:జడప్రాయంగా ఉన్న సమాజాన్ని మృతప్రాయంగా ఉన్న వ్యవస్థకు కొత్త ఊపిరిపోసి, కొత్త నెత్తురు ఎక్కించిన పునరుజ్జీవన, జాతియోద్యమ, విప్లవోద్యమ కేంద్రస్థానమైన బెంగాల్ మాగాణంలో ఉద్భవించిన మేధావి వివేకానందుడు. 18, 19 శతాబ్దాల్లో స్తబ్ధమైన భారతీయ సమాజాన్ని మేల్కొల్పడానికి రాజారామ్ మోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, దయానందసరస్వతి సారథ్యంలో కొనసాగిన సంస్కరణోద్య మాన్ని వివేకానందుడు గొప్ప ముందడుగు వేయించాడు. 'జ్ఞాన పిపాసే మోక్షానికి సాధన' అన్న ఉపనిషత్తులను హేతువాదం, వివేకం, మానవవాదాలు మేధో హృదయాలుగా ఉన్న బౌద్ధ ధర్మాన్ని, ఇంకా అనేక ప్రాచీన చింతనా ధోరణులను స్ఫూర్తిగా తీసుకొని స్పష్టమైన దృక్పథంతో కార్యాచరణతో సమత జ్ఞాన విప్లవాన్ని వివేకానందుడు ఆరంభించాడు. వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం, సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ అనుసరణీయంగా ఉన్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం. పేదవాని కష్టంతో పైకి వచ్చి వారి బాగోగులను పట్టించుకోని ప్రతివాడు దేశద్రోహి. సంపద సృష్టికర్తలైన శ్రామికులే ఈ దేశ ఆశాకిరణాలు' ఈ వ్యాఖ్యలు చదువగానే వర్గసంఘర్షణ సిద్ధాంత ప్రవక్త కార్ల్‌మార్క్స్ నిర్దేశించిన మార్గంలో నూతన ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మిస్తామనే విప్లవకారులు చేసినవి అని అనుకుంటారు. కానీ ఎప్పుడో వివేకానందుడు ఇలాంటి తన ప్రసంగాలతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు. 1863 జనవరి 12న కలకత్తా నగరంలో మధ్యతరగతి కుటుంబంలో వివేకానందుడు జన్మించాడు. బాల్యం నుండే విద్యా, క్రీడల్లో చురుకుగా రాణించాడు. 1883లో కలకత్తా ప్రెసిడెన్సి కాలేజీ నుండి పట్టభద్ర పట్టా పుచ్చుకున్నాడు. తత్వ శాస్త్రం పై ఇష్టంతో పాశ్చాత్య తత్వచింతనా పరులైన జాన్ స్టువర్ట్ మిల్, హెర్బర్ట్ స్పెన్సర్, హేగెల్ దర్శనాలను యువ వివేకానందుడు శ్రద్ధగా అధ్యయనం చేసాడు. తనలో తీవ్రమవుతున్న జ్ఞాన పిపాసకు, దైవము, మానసమాజం పై వస్తున్న అనేక సందేహాలను 'మానవ సేవే మాధవసేవ అని ప్రవచించిన రామకృష్ణ పరమహంస దగ్గర నివృత్తి చేసుకొని, ఆయన శిష్యుడిగా మారాడు. ప్రజల మధ్య జీవించి వారి కష్టసుఖాలను తెలుసుకొని, బాధల నుంచి వారిని విముక్తి చేసేవారే చరిత్రలో నిర్మాతలుగా, తత్వవేత్తలుగా మిగిలిపోతారు. ఈ వెలుగులో 1888 నుండి 1892 వరకు వివేకానందుడు ఆసేతు హిమాచలం పర్యటించాడు. తన కాలపు ప్రజలు విద్యకు, విజ్ఞానానికి దూరంగా మూఢవిశ్వాసాలకు ,దారుణ సాంఘిక దురాచార కబంధహస్తాల్లో నలిగిపోవడం చూసాడు. ఉపనిషత్తులు, జైన, బౌద్ధ మతాలు విలసిల్లి ప్రపంచానికి శతాబ్దాలపాటు జ్ఞాన కాంతులు ప్రసరించిన భారతదేశం కాల వైపరీత్యాలకు లోనై ఔన్నత్యాన్ని కోల్పోయిందని వివేకానందుడు గ్రహించాడు. శ్రామికులు, స్త్రీల పట్ల అంతులేని వివక్షత కొనసాగుతుందని, యువత నిస్తేజంగా మారిపోయిందని, నైతికంగా, భౌతికంగా భారత జాతి నిర్వీర్యం అయిందని గ్రహించాడు. భారతీయ మూలాల నుండి నిజమైన వేదాంత దృక్పథాన్ని రూపొందించి, జాతి, మత పరమైన అన్ని రకాల అధిపత్యాలను, రూపుమాపే ప్రజాస్వామిక సిద్ధాంతంగా మార్చాడు. 1893లో చికాగో నగరంలో ప్రపంచ మత సదస్సుకు హాజరై భారతీయ తత్వసారాన్ని అద్భుత రీతిలో తెలియజేసి, ప్రపంచాన్ని ఆకట్టుకున్నాడు. 1894 నుంచి 1897 వరకు అనేక పశ్చిమ దేశాలలో పర్యటించి, వేదాంత సారాన్ని భోదిస్తూ, భారతదేశాన్ని పేదరికం, అజ్ఞానం నుంచి ఉద్ధరించడానికి సహాయ సహకారాలను వివేకానందుడు అభ్యర్థించాడు. కలకత్తా, మద్రాసు నగరాలలో ఆశ్రమాలను, విద్యాలయాలను స్థాపించాడు.

సమస్త సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి, సౌఖ్యమైన భౌతిక మానసిక వికాస జీవనానికి తోడ్పడే నాగరికత సంస్కృతులను పెంచడానికి విద్య, విముక్తిదాయినిగా పనిచేస్తుందని, పశ్చిమ దేశాల అనుభవం నుంచి వివేకానందుడు గ్రహించాడు. తన దైన విద్యాతత్వ శాస్త్రాన్ని రూపొందించి, విద్యావ్యాప్తికి కృషి చేశాడు. మనషిలో నిగూఢమై ఉన్న పరిపూర్ణత్వాన్ని వ్యక్తం చేయించేది విద్య అని వివేకానందుడు నిర్వచించాడు. జీవితాన్ని నిర్మించడమూ, సద్గుణ సంపన్నులైన మనుషులను రూపొందించడమూ విద్య ఆశయాలుగా ఆయన పేర్కొన్నాడు. విద్యలో సమాన అవకాశాలను కల్పించిన ప్రాచీన నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లభి విద్యలయాల సుసంపన్న మహత్తర సంప్రదాయాన్ని పునఃప్రతిష్ఠింపచేయాలని, ప్రభుత్వము, పౌరసమాజం విద్యను అందించడమే ప్రథమ కర్తవ్యంగా చేపట్టాలని ప్రజలను చైతన్యవంతం చేశాడు. ఆ నాటి సమాజంలో వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగివున్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల, సామాజిక బాధ్యత లేని పెట్టుబడుదారీ శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం.భా రతదేశంలోఎందరో మహానుభావులు అప్పుడప్పుడూ తళుక్కున మెరిసి జాతిని మేల్కొలిపారు. సమాజాన్ని రుజువర్తనలో పెట్టే ప్రయత్నాలు చేశారు. ఆ తరవాత వారి అడుగుజాడల్లో నడిచి దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లిన వారూ ఉన్నారు. అలాంటి మహానుభావుల్లో స్వామి వివేకానందుడు అగ్రగణ్యుడు అని చెప్పక తప్పదు. వివేకానందుడు హిందూ సమాజ పునరుజ్జీవనానికి, సాంస్కృతిక జాతీయవాదాన్ని శక్తిమంతం చేయటానికి చేసిన కృషి అనన్య సామాన్యం. వివేకానందుడు ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్తకుడు.

జాతిని జాగృతం చేసిన మహానుభావుడు

వివేకానంద స్ఫూర్తి నిరంతరం అనుసరణీయం

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): పతనం నుంచి ఈ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి వివేకానందుడు ప్రపంచాన్ని చైతన్యవంతం చేయటానికి ప్రయత్నించారు. విలువల దార్శనికతతో సమాజాన్ని ఉన్నతస్థితికి తీసుకొనిపోలేకపోతే భౌతిక సంపద తెచ్చిపెట్టే ప్రగతి పతనం వైపు దారితీస్తుంది. అందుకే భౌతికవాదానికి కొనసాగింపుగా ఆధ్యాత్మికత అవసరమని వివేకానంద భావించారు. మన మత వ్యవస్థలను హేతుబద్ధమైన, చైతన్యశీలమైన వేదాంతవు తర్కంతో విప్లవీకరించారు. మానవుని నైతిక, ధార్మిక ప్రవర్తనే కీలకమని వివేకానందుడు చెప్పారు. యువతను జాగృతం చేసి, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి ముందుకు నడిపిన వారిలో స్వామి వివేకానంద అగ్రగణ్యుడు. ఆత్మవిశ్వాసం లేనివాడు నాస్తికుడు అనేది నేటి మాట అని నిర్మొహ మాటంగా చాటాడు స్వామి వివేకానంద. అంతేకాక 'మనం సోమరులము, ఏ పని చేయలేము ముందు మనమంతా సోమరితనాన్ని వదిలి కష్టించి పనిచెయటం అలవర్చుకోవాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది అంటూ యువతరాన్ని ప్రేరేపించిన మహాశక్తి, గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద. అందుకే వివేకానందుడు చోదక శక్తిగా నిరంతరం యువతకు మేలుకొలుపుగా ఉంటాడు. గొప్ప అవకాశాలే వస్తే ఏమి చేతకాని వారు కూడా ఏదో గొప్ప సాధించ వచ్చు. కానీ ఏ అవకాశాలూ లేనప్పుడు కూడా ఏదైనా సాధించాలనే పట్టుదల ఉన్నవారే గొప్పవారు కాగలుగుతారు. ఇలాంటి కోవలోకి స్వామి వివేకానంద వస్తారు. అనంత శక్తి, అపారమైన ఉత్సాహం, అమేయ సాహసం, అఖండ సహనం ఇదే మనకు కావలి. వీటితోనే ఘనతను సొంతం చేసుకోగలం. వెనక్కి చూడకండి ముందుగే వేయండి. అన్న సూక్తిని పాటించేలా జనాన్ని జాగృతం చేసిన మహనీయుడాయన. అన్నింటికి మించి పట్టుదలే మనిషిని మనీషిగా మారుస్తుందని ఉద్బోధిస్తాడు. దైవ విశ్వాసం కంటే మానవ విశ్వాసం ముఖ్యమని బోధిస్తాడు. ముక్కోటి దేవతలలోనూ నమ్మకమున్నా నీలో నీకే విశ్వాసం లేకపోతే నీకు ముక్తి లేదంటాడు. ఆయన భావజాలంతో సాగుతున్న జాతిపునర్నిర్మాణ కార్యంలో పాల్గొని రామకృష్ణ మఠం లాంటి సంస్థలు, వ్యక్తులు ఇప్పటికీ నిరంతరంగా శ్రమిస్తున్నాయి. భారతదేశంలో వేల సంవత్సరాలనుండే ఒక మనిషి జీవితానికి లక్ష్యం చతుర్విధ పురుషార్థాలుగా ధర్మం, అర్థం, కామం, మోక్షం అని చెప్పారు. భౌతికసుఖాలు, సంపదలు వద్దనలేదు. అందులోనే మునగకుండా సత్యాన్వేషణలో మోక్ష సాధనకు కృషిచేయాలని చెప్పారు. వివేకానందుని వ్యక్తిత్వాన్ని, సందేశాన్ని సామ్యవాద దేశాలు కూడా ప్రస్తుతించాయి. రష్యా, చైనాలలో వివేకానందుని 120వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. సామాజిక పరివర్తన అనే ఇంజనుకు తగిన ఇంధనం వేదాంతమేనని వివేకానందుని స్పష్టమైన అభిప్రాయం. ఆయన సామాజిక చింతనలో మరో స్పష్టత 'జాతీయ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థానంలో ఉన్న వారిని పడగొట్టటం కాదు, దిగువన ఉన్న వారిని ఉన్నతస్థితికి తీసుకొనివెళ్ళటం అన్నదే స్వామి లక్ష్యం. హిందుత్వంపై వివేకానంద గర్జ్సే కహో హమ్ హిందూ హై అని చెప్పారు. అలా చెబితే వేల సంవత్సరాల మన మహాపురుషుల పరంపర, చరిత్ర, సంస్కృతులు మనకు గుర్తువస్తాయి. వివేకానందుడు హిందూ సమాజ పునరుజ్జీవనానికి, సాంస్కృతిక జాతీయవా దాన్ని శక్తిమంతం చేయటానికి కృషి చేశారు. ఆయన ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్తకుడు. వివేకానందునికి సత్యసిద్ధాంతమైన వేదాంతం ముఖ్యం. 'ఈ దేశం బాగుపడాలంటే జనసామాన్యాన్ని జాగృత పరచాలి. మన జాతి చేసిన అతిపెద్ద పాపం జన సామాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం. వారిని ఎదగనిస్తే సమాజం బాగుపడు తుంది. వారికి సకారాత్మకమైన విద్య నందిస్తూ జాగృతం చేయటం మనందరి కర్తవ్యమని' వివేకానందుడు చెప్పేవారు. అందుకే 'దరిద్రదేవోభవ' అన్నది ఆయన మంత్రమయ్యింది. వివేకానందుడు సాంస్కృతిక జాతీయవాదానికి పెద్దపీట వేసాడు.

యువతకు చోదశక్తిగా స్వామి వివేకానంద

స్వామితో ప్రేరణ పొందిన సిస్టర్ నివేదిత

కోల్‌కతా,జనవరి11(ఆర్ఎన్ఎ): దేశ ప్రజలందరికి ఆత్మవిశ్వాసం క్రియాశూరత్వము కావాలి. ఈ అవసరము నాకు స్పష్టంగా కనిపిస్తుంది అని నొక్కి చెప్పారు. భగవంతుడి పట్ల నమ్మకం లేనివాడు నాస్తికుడు అనేది ఒకప్పటి మాట. వివేకానందుడు గొప్ప తాత్వికుడు. అతని ముఖ్య బోధనల ప్రకారం అద్వైత వేదాంతం తత్త్వ శాస్త్రములోనే కాకుండా, సామాజికంగా రాజకీయంగా కూడా ఉపయోగ పడుతుంది. భారతదేశాన్ని ప్రేమించడమెలాగో, ఉద్ధరించడమెలాగో నేర్పిన మహనీయుడు స్వామి వివేకానంద! ఓ తేజస్వరూపా! జననమరణాలకు అతీతుడా! మేలుకో. బలహీనతల్ని తొలగించుకో. పౌరుషాన్ని ప్రసాదించుకో. మనిషిగా మసలుకో. లే..... లెమ్ము అంటూ యువతను జాగృతం చేసిన వేదాంతభేరి స్వామి వివేకానంద. అందుకే ఆయన చికాగో సర్వమత సమ్మేళనంలో చేసిన ప్రసంగం నేటికీ చిరస్మరణీయంగా నిలిచిపోయింది. మనిషిలో అహం తగ్గి, ఇతరులను ప్రేమించాలన్న భారతీయ ఐతిహ్యాలకు ప్రతీకగా వివేకానందుడి ఉపన్యాసాలు ప్రేరణగా నిలిచాయి. అందరు తనవారనుకుంటేనే నిజమైన స్వేచ్ఛ లభిస్తుందనే వేదాంత తత్వానికి చెందిన వ్యక్తి వివేకానందుడు. ఆయన బోధనలు, అనుసరించిన మార్గాలు నేటికీ యువతకు ప్రేరణగా నిలుస్తాయి. పిరికితనానికి మించిన మహాపాపం ఇంకోటి లేదు. ఒక దెబ్బతింటే రెట్టింపు ఆవేశంతో పది దెబ్బలు కొట్టాలి, అప్పుడే మనిషినని అనిపించుకొంటావు. పోరాడుతూ చనిపోయినా ఫర్వాలేదు. కాని పోరాటం అవసరం అంటాడు. ఆత్మవిస్వాసం లేకపోవడం అనేది క్షమించరాని నేరం. గొప్ప వ్యక్తుల జీవతాలన నిశితంగా పరిశీలిస్తే వారిని నడిపించింది ఆత్మవిశ్వసమేనని తెలుస్తుంది. ప్రేమ... డబ్బు... జ్ఞానం.. చదువు... దేనికోసమైనా తపనపడుతూ పిచ్చివాడై పోయేవాడికి అది తప్పకుండా దొరుకుతుందంటాడు. అందుకోసం మనం ఉడుంపట్టు లాంటి పట్టుదల, సంకల్పబలం, శ్రమించే తత్వం కనబర్చాలని ఉద్బోధించాడు. అతడి జీవితంపై రామకృష్ణ పరమహంస ప్రభావం ఎంతగానో ఉంది. సామాన్యుడిగా ఉన్న నరేంద్

మాదిగ విజయం - సమీక్ష

అంటరాని వారు, ముట్టరాని వారు, అస్పృశ్యులు, నిమ్నజాతి వారు, హరిజనులు, దళితులు, మాదిగలు చండాలురు, చమారులు, పంచములు, దేవునిబిడ్డలు అని ముక్కోటి దేవుళ్ళకున్న పేర్లు వీరికి సంక్రమించాయి. పేరుకుమాత్రమే దేవుని బిడ్డలు కానీ దేవాలయ ప్రవేశమే లేని దౌర్భాగ్యపు స్థితిని వీరికి కల్పించింది మన భారత సమాజము. హరిజనులు అని గాంధీ గారిచే పిలువబడిన వారికి హరి దగ్గరకు ప్రవేశమే లేదు. అదృష్టము ఒంటికాలుమీద నడిస్తే దుర దృష్టము నాలుగు కాళ్ళ మీదనడిచింది వారి జీవితాలలో. పంచభూతములు లేనిది సృష్టి లేదు పంచముడు చేయని పనిలేదు . యిన్ని చేసినా వివక్ష తప్పదు. మనుషులంతా ఒక్కటే కాని మాదిగోడు వేరు అన్ని పనులలో దళితులను ముందుంచే సమాజము అందలం ఎక్కించడంలో మాత్రం పాతాళానికి తొక్కేస్తుంది. దొరల అన్ని పనులు చేయడానికి దళితులు కావాలి కాని అంటుకుంటే అదేదో మహాపాపం అన్నట్లు చూస్తరు. అలాగని ఎదిరించే ధైర్యము ఎవరికి లేదు , ఎదిరించినవాడెవడు బతికి బట్ట కట్టింది లేదు.జరు గరాని ఘోరాలన్నిదళితుల మీదనే జరుగుతున్నాయి. వీటన్నిటికి కారణం అజ్ఞానం, అవిద్య .యివి లేకనే జీవితాలు యిలా తగులబ డుతున్నాయి అనేది జీవిత సత్యం. స్వాతంత్ర్యానికి ముందు తరువాత కూడా దళిత జీవితాల నేపథ్యాన్ని చూపిస్తు "అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేస్తు .అజ్ఞానమనెడి అంధకారం నుండి విజ్ఞానమనెడి వెలుగు బాటలు వేసుకుంటు పున్నమి నాటి చంద్రునివోలె దినదిన విజ్ఞానాభివృద్ధిని సాధించుకుంటు అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత ఉద్యోగాన్నిసాధించిన" దళిత కుటుంబ నేసథ్యమే డా॥కాలువ మల్లయ్య గారు రాసిన "మాదిగ విజయం" .

అది నిజాం పాలన కింద వున్న తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కేంద్రానికి దగ్గరలోని ఒక ఊరి మాదిగ వాడ. అక్కడ బుచ్చయ్య తన తండ్రి రామయ్య, భార్య కనుకమ్మ, కొడుకులు లింగయ్య, రాజయ్య, పేరయ్యలది ఒక కుటుంబం.

దొరల కాలంలో వెట్టి చాకిరి,పాలేరు వ్యవస్థ వుండడం గురించి .రామయ్య తండ్రి తన కూతురు పెళ్ళికోసం అప్పుచేసి తీర్చకుండానే చనిపోవడం,ఆ అప్పు రామయ్య తీర్చాలని దొరలు పట్టుబట్టడం ఎంత ప్రతి ఘటించిన రామయ్య చివరకు దొరలకు అప్పుతీర్చ ఆస్థిపాస్తులు లేక జీవితాంతం వారికి వెట్టిచాకిరి చేసి తనువు చాలించిన రామయ్య జీవితంలో చూపించారు.

బుచ్చయ్య చెప్పులు కుడుతూ ,తాళ్ళు పేనుకుంటు కుటుంబాన్ని నడిపించేదని .పెద్దకొడుకు లింగయ్య తాత వారసత్వం కాకపోయినా దొరలకు పాలేరుండక తప్పలేదని. రాజయ్య తండ్రికి పనిలో సహాయంచేస్తు కూలి పనులు చేసుకునే వాడని. దొర దృష్టి చిన్నవాడైన పేరయ్య మీద పడిందని. ఎడ్లు కాసే పాలేరుగా వుండమనడం పేరయ్యకు గాని తండ్రి బుచ్చయ్యకు గానీ ఏ మాత్రం యిష్టంలేదని. అన్యాయాన్ని ఎదిరించే తత్వం వారిలో వుంది కానీ దొరలను ఎదిరించి బతుకగలిగే జీవితం అక్కడ ఎవరికి లేదని. అంత సాహసం ఎవరు చేయలేరని. బుచ్చయ్య కుటుంబ నేపథ్యాన్ని పరిచయం చేశారు.దానికి నిదర్శనంగా దొర యింటి ముందు నుండి పోయిన మాల రాజలింగం ఎడ్లబండిఆపి అందులో వచ్చిన యువకున్ని శిక్షించిన తీరును చూసి భయభ్రాంతులకు గురై యిష్టం లేని పనిని కష్టంగా ఒప్పుకోవడంలో దొరల ఆగ్రహజ్వాలలు ఎలా వుంటాయో, అమాయకులు ఎలా ఆహుతి అయ్యే వారో దయ. జాలి, కరుణ లేనిదొరల పాశవికత్వం ఉన్నది ఉన్నట్టు నేర్పుతో ప్రదర్శించారు రచయిత డా॥ కాలువ మల్లయ్య గారు.

అప్పటి ఆ ఊరి దొరలను యమునితో పోల్చుడంలో రవ్వంత సందేహం కూడా అవసరం లేదనటానికి భారతదేశం బ్రిటీష్ వారి పాలనలో, తెలంగాణ నిజాం పాలనలో వుండేదని. బ్రిటీష్ ఆంధ్రలో మధ్యతరగతి కుటుంబాలు వుండేవి కాని తెలంగాణలో మాత్రం అగ్ర, అణగారిన వర్గాలే అని మధ్యతరగతి మాటకైనా లేదని. తనతండ్రి రామయ్య వాళ్ళ తండ్రి చేశాడో చేయలేదో కాని ఆ బాకి తీర్చడానికి తను జీవితకాలం దొరలకు పాలేరు పనిచేయడంతోటే గడిచిపోయిందని. దొరల పనులు ఎలా వుంటయో, వాళ్ళ దుర్మార్గపు ఆలో చనెలా వుంటాయో, చీకట్లోవుండని ముట్టుడు వెలుతురులోఎందుకుంటుందో, దొరలకు పాలేరుండటమంటే యముడి దగ్గరకు పంపినట్టే అనితెలిసి కూడా ఏమి చేయలేక పోయా అని తండ్రి చెప్పిన మాటలతో నులక మంచంలో పడుకొన్న బుచ్చయ్య ఆలోచనా పరంపరలో పలికించారు.

మాల మదిగలు వారి మధ్య వ్యత్యాసాన్ని పాటించే వారని తెలిపేందుకు మాల, మాదిగ వారు యిద్దరివి దగ్గరి దగ్గరి జీవితాలే,యిద్దరు అంటరాని వారిగా పరిగణించిన . వారి మధ్య పెద్దముట్టుడు, చిన్న ముట్టుడు అని రెండు రకాలుండేదని. మాదిగలు అంటుతే మాలవారు ముట్టు పాటించేవారని .దళితులే అయినప్పటికి వారి మధ్య మంచం పొత్తు,కంచం పొత్తు లేదని, యిద్దరికి గుడి ప్రవేశం లేదని వారి మాటల్లోనే చూపించారు.

మాదిగ వాడలోని ప్రజల జీవన విధానం, వారి గుడిసెలు, తీసుకునే ఆహారం, ధరించే దుస్తులు వారిభాష, వేశం, చుట్టూ వుండు పరిసరాలు అక్కడి దుర్భర జీవన విధానం ఎలా వుంటుందోస్పష్టంగా నిజ జీవితం కదలాడినట్లు చూపించారు. అలాగే మిగతా వృత్తుల వారి జీవన విధానం వారిపనులు, పనిముట్లు,అలవాటు ఆ ఊరి నుండి పొరుగూరికి రవాణా సౌకర్యాలు లేవన్న విషయాని చెప్పకనే చెప్పడం జరిగింది.

నోటికాడి బుక్క అందకుండ పోయే దురదృష్టం ఎలా వుంటుందో తెలిపేందుకు దాతనామ సంవత్సరం కరువు కరాళ నృత్యం చేస్తున్న సమయంలో మాదిగవాడంతా గొడ్డు మాంసంతో మాడిపోయిన తమ కడుపులను ఆనందంగా నింపుకునే ఆతృతతో వున్న పండుగలాంటి సమయంలో రామయ్య వెట్టి జీవితానికి విముక్తి కలిగించి, అందరిని శోక సంద్రంలో ముంచేశారు .యిక్కడ ఒకబాధ చనిపోయినందుకు ఐతే రెండోది ఆకలిబాధని, పేరయ్యయింట్లో కెళ్ళి గాబరగా తినడం ద్వారా అప్పటి దుస్థితి ఎలావుందో తెలియ పరిచారు. చనిపోయిన పీనుగువెంట చల్లినబోలు పేలాలు ఏరుకుతిన్న నర్సమ్మ అన్ని రోజులు ఏడ్వకుండ వెళ్ళిపోయే రోజు ఏడ్చిన ఆకలి ఏడుపు అందరిహృదయాలను కదిలించి కంటతడి పెట్టించిన తీరు అమోఘంగా చిత్రించారు రచయిత గారు.

దళిత జీవనంలో భాగంగా దొర ఎద్దు చచ్చిపోతే వారి యిండ్లలో పండుగ అని దాని తోలును ఒలిచి శుభ్రంచేయడంలో వారి వెట్టి జీవితాలను చూపించారు సారు , మతం మార్చుకొని ముస్లింలుగామారిన వారి దర్జా ఎలా వుండేదో దొరల దగ్గర వుండే మదార్‌సాబ్‌ను, వాడి అహంకారములో,దౌర్జన్యపుమాటల్లో చూపించారు. వాడొక్కపు డుమాల కులస్తుడే మతం మార్చుకోవడం వలన వానికాస్థితి వచ్చిందనడంలో మతమార్పిడులు జరిగేవన్న విసయాన్నితెలిపారు .చేసేది సుంకరి పనే అయినప్పటికి వీడే దొరలకన్నా ఎక్కువై పోవడం.దొరలు చెప్పిన పనులు ఎంత కష్టమైనా వెంట వెంటనే చేయాలి లేకుంటేవారి చేతులతోనే తయారుచేసిన చెప్పులు వారి వీపులమీద తాండవం చేసేవని అలాంటి దుర్భరజీవి తాన్ని గడిపే రోజులని వారి మాటలల్లో వినిపించారు.

పాచిపోయిన గడుకంబలి కూడా పరమాన్నం అయ్యేదని తెలిపేందుకు పేరయ్యను బుదరకించి తాగించిన కనుకమ్మ బుజ్జగింపులో చూపించారు . మెతుకుల బువ్వ గురించి పేరయ్య పడిన ఆరాటం కొడుకు కోరికను నెరవేర్చాలని పండుగనాడు వండి పెడుతానన్న తల్లి కనుకమ్మ తపన ,ఆతృత ద్వారా అప్పట్లో మెతుకుల బువ్వకున్న విలువను తెలియజేశారు.

దొరలిండ్లలో శాపనార్థాలతో పెట్టె బువ్వకు కుటింబీకులతో కలిసి తల్లి పెట్టె బువ్వలో కారమెక్కువైన ప్పటికిమమకారం వల్ల అది ఏర్పడని పేరయ్య మాటల్లో గొప్ప తారతమ్యాన్ని చూపించారు. పాలేరోనికి పండుగ రోజైనాపనిరోజైనా ఒక్కటేనని తెలిపేందుకు వీరమల్లుతో దొర పనికి రమ్మన్నాడని పిలిపించారు.

దొరల యింట్ల ఆడపిల్ల పెండ్లి అయితే ఓ దాసిదాన్ని అరణంగా పంపడం ఆనవాయితీ వుండేదని పని మనిషి నర్సిని సుశీలా దేవితో పంపడం ద్వారా మనకు తెలియపరిచారు. యిష్టమున్నాలేకపోయినా నర్సి తన వారినితల్లిదండ్రులను యిబ్బంది పెట్టడం యిష్టం లేక తన నిండు జీవితాన్ని బలితీసుకున్న విధానం ఎంతో హృదయ విదారకంగా చూపించారు .

సమాజంలో గురువు యొక్క ప్రత్యేకతను తెలియజేసేందుకు,ఆ ఊరికి దొరలను రప్పించి దొరలతో వంగి వంగి దండాలు పెట్టించారు. దళిత వాడలకు రాకపోవడంలో అది అగ్రకులాలకే పరిమితమని .గురువులకు కూడా పక్షపాతముంటుందేమో అని చిన్న అసహనాన్ని కల్పించారు. భూమి వున్న రైతుకు లేని వారికిఉన్నటువంటి ముఖతెలివిని కాపు సర్సిరెడ్డి , మాదిగ బుచ్చయ్య మాటలల్లో అందరికి అర్థమయ్యే సంభాషణలు కల్పించారు.

బతుకమ్మ పండుగ చేసుకుంటామన్న దళితులను దొరలు చితక బాధటం.వాళ్ళ ఆనందాన్ని కాలరాయడం దొరల ఉనికిని కాపాడుకోవడం కోసమేనన్నట్టు చిత్రించారు. తెలంగాణలో నిజాంపరిపాలన వున్నా దేశంలో క్రైస్తవాధి కారంవుండటం వలన అందులోకి మారవద్దనే దురాలోచనతో దళితుల కులదైవాలకు గుళ్ళ ,గోపురాలు కట్టించడం హిందూ మతం జోలికి రాలేదన్న వాస్తవాన్ని చూపించారు. మతం మార్చుకోవడానికి ప్రేరేపించిన పరిస్థితులు అందుకు గల కారణాలను కొందరు యువకులు పెద్దమాదిగ బాలయ్య యింటి ముందు గుమిగూడిన దళిత యువకుల మాటలల్లో అప్పటి వాస్తవ పరిస్థితులను చూపించారు.

ఏదైనా విషయాన్ని ఊరంత తెలియజేయడానికి డప్పుకొడుతు ఊరు చాటింపు చేసే వారని అది మాదిగ కులస్థులే చేసే వారని పోలీస్ పటేల్ మాదిగ బుచ్చయ్యను పిలిపించి చాటింపు చేయడం ద్వారా తెలియజేశారు."నూర్ల మందికి చెప్పులు కుట్టిత్తవు నీకు చెప్పులుండద్దా " అన్న కనుకమ్మ మాటలద్వారా ఆరోజుల్లో చెప్పులేసుకునిదొరలకు కనబడటం మహా నేరంగా పరిగణించే వాళ్ళని, చీకట్లోనైనా చెప్పులు వద్దన్న బుచ్చయ్య మాటల్లో వినిపి ంచారు. డప్పు కొట్టడంలో నేర్పరి అని అతడు డప్పును రకరకాల శబ్దాలతో వాయించడం ద్వారా తెలిపారు.

నిజాంమనుషులు తాసీలు వసూలుకు రావడం దొరలకు, పోలీస్ పటేల్ , పట్వారికి పండుగ లాంటిదైతే ఊరి జనానికి అది పీడ లాంటిదని, ఊరు గుళ్ళ కావడం, దండనలు ,శిక్షలు, యింటి సామా నులు, గొడ్డుగోద వేళంకోళ్ళు, గొర్లు మటుమాయం ,స్త్రీలమానభంగాలు, అత్యాచారాలకు కొదువే లేదు .దొరల మాట నెదురించక చెప్పినపనులెల్ల ఎదురుమాట్లాడకుండా వెంటవెంటనే చేయడం ఆ ఊరి పెద్ద మనుషులకు అలవాటైపో యింది. రాత్రులు జరిగే భాగోతం ఎదురించిన రంగమ్మను శిక్షించిన అరాచక విధానం, ఖాన్, ఖాదిర్‌ల కసాయి తనానికి బలై చనిపోయిన రంగమ్మను ఎవరు పట్టించుకోని ధీన స్థితి పాఠకుల కళ్ళ ముందు ప్రత్యక్షం చేశారు రచయిత గారు.

పేరయ్యను ఓ యింటి వాన్ని చేయడం కొరకు పెండ్లికి ఒత్తిడిని కలిగించాలని "వయసులో వున్నప్పుడు సంపాదించిన ముల్లెన్నా వుండాలి కడుపున పుట్టిన సంతాన మన్నా వుండాలి" అని బుచ్చయ్యతో అమా టలు పలికించారు. ఆకాలంలో మేనరికం వివాహాలు జరిగేవని తెలియజేయడానికి మేనమామ గంపయ్య పిల్లనిత్తననిరా వడంలో చూపించారు . ప్రేమ వివాహాలు బీజ ప్రాయంలో వున్నవని తెలుపడానికి పేరయ్య యిష్ట పడిన అమ్మాయితో వివాహం జరిపిం చారు.

దళితులు సుఖంగా కాపురం చేసుకోవడాన్ని, ఎదురు మాట్లాడడాన్ని దొరలు సహించి ఊరుకునే వారు కాదని ,ఎంతటి పాపానికైనా పూనుకునే వారని ఈరమ్మ మానాన్ని దోచుకోవడం ద్వారా దొరల కక్ష్యసాధింపు ధోరణిబహిర్గతంచేశారు. .ఈరమ్మను భర్త పేరయ్య తప్పుబట్టకుండా ప్రేమగా దగ్గరికితీసుకోవడం, అత్త మామలు కూతురులాగా భావించి అక్కున చేర్చుకునే సహృదయ భావాలు గల కుటుంబాన్ని మనకు చూపించారు.

పేరయ్య పౌరుషం వున్న వ్యక్తని తెలిపేందుకు మొదటి సారిగా కత్తి చేత బట్టుకొని దొరల నెదిరించిడంలో చూపించారు. అర్థ బలం,అధికార బలం ముందు సామాన్య మానవుడు ఏమిచేయలేడన్న పేరయ్య పౌరుషం వున్న వ్యక్తని తెలిపేందుకు మొదటి సారిగా కత్తి చేత బట్టుకొని దొరల నెదిరించిడంలో చూపించారు. అర్థ బలం,అధికార బలం ముందు సామాన్య మానవుడు ఏమిచేయలేడన్న నిజాన్ని జైలుకు పోయిన పేరయ్య ద్వారా తెలియజేశారు .కమ్యూనిష్టులకు దొరలు భయపడేవారని ఊరదిలి పారిపోడంలో చూపించారు.

కాట్రేవుల పండుగలో పేరయ్యను చూపించడాన్ని బట్టి సంక్రాంతి రైతులకు పెద్ద పండుగని .నిజాం పరిపాలనే అయినా హిందువులు తమ పండుగలను స్వేచ్ఛగా జరు పుకుంటున్న రోజులని అన్ని మతాలవారు అన్నిపండుగలలో పాల్గంటున్నారనే విషయాన్ని తెలియజేశారు. "మట్టిని నమ్ముకుంటే మట్టే మిగులుతుందన్న"మాటలోవ్యవసాయంలో లాభం ఏమి లేదని అన్ని నష్టాలే అని తెలిసేందుకు రైతు కోటయ్య పేరయ్య ల మధ్య సంభాషణ సృష్టించారు.

అప్పట్లో పట్వారులు నిరక్షరాస్యులను ఎలా మోసం చేసే వారో వెల్లడించేందుకు. పట్వారి వెంకటేశ్వర రావు పేరయ్య దగ్గర 50రూ॥లు లంచం తీసుకుని రాళ్ళ భూమిని చూపించడంతో యాభై రూపాయలకున్న విలువను తెలుపుతు పట్వారి మోసాన్ని బట్టబయలు చేశారు సారు. దళితుడైన పేరయ్య భూమికి యజమాని కావాలన్న బలమైన కోరికను తీరేలా చేసి. రాళ్ళ భూమిని రతనాల భూమిగా మార్చడంలో పేరయ్యకున్న పట్టుదల,ఆత్మ విశ్వాసం బయట పడేశారు.

యింతలో ఓ తరం గడిచే పోయింది.

అప్పుడు అందుబాటులో వున్న ప్రసార మాధ్యమం రేడియో ఒక్కటేనని తెలిపేందుకు ఆగష్టు 15,1947 భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని .దేశమంతా వేడుకలు చేసుకుంటున్నారని. మొదటి ప్రధాని నెహ్రూఅని రేడియో మాటల్లో వినిపించారు. తెలంగాణకు స్వాతంత్ర్యం రాలేదన్న విషయాన్ని మదార్ సాబ్ మాటల్లో చెప్పించారు.అదే రోజు ఈరమ్మ మగ పిల్లవానికి జన్మనిచ్చి బాలింతరాలైందని తెలుపుతూ. ఆ రోజుల్లో ప్రసవం గురించి, వైద్యంసౌకర్యం లేని ధీన స్థితిని గురించి, మంత్రసాని మంగళి సాయమ్మ ఈరమ్మకు చేసిన సహాయం ద్వారా యింకా నాటు వైద్యమే రాజ్యమేలుతుందని తెలియ పరిచారు. పేరయ్య కుటుంబాన్ని ఆనందసాగరంలో ముంచడానికి స్వాతంత్ర్య దినం నాడు పుట్టిన బిడ్డ చాలా అదృష్టవంతుడు, గొప్పోడవుతాడన్న మాటలుయిరుగు పొరుగు వారితో చెవులకు తగిలించారు.

నిజాం పాలనలో తెలంగాణలో రజాకార్లు అనే దుర్మార్గులు వుండే వారని తెలియజేయడానికిరజాకార్లు ఊళ్ళోకి వస్తున్నారన్న వార్తా దానాలంలా వ్యాపింపచేసి. వాళ్ళు వస్తే జరిగే ఘోరం తెలియని వాళ్ళు లేరంటే అతిశయోక్తి కాదని. స్పష్టం చేస్తు ఆ పెను ప్రమాదాన్ని తప్పించడం కోసం కుండపోత వర్షాన్ని అద్భుతంగా సృష్టించారు. నిజాం పాలన అంతమైందని తెలిపేందుకు. తెల్లవారి పటేల్ సైన్యం నిజాంను లంగదీసుకోవడంపెద్ద ముప్పు తప్పించిందని అందరు ఊపిరి పీల్చుకోవడంలోని వాస్తవాలను వెల్లడించారు .

దొరల రాజ్యం మళ్ళీ రావడంతో కథ మొదటికొచ్చిందని తెలిపేందుకు పటేల్ సైన్యం కమ్యూనిష్టులపైతుపాకి గురిపెట్టడం. సూర్యారావు దొర తన భూములను చూసుకునే క్రమంలో పట్వారి పేరయ్యకిచ్చిన భూమిని చూసి అగ్గి మీద గుగ్గిలమవ్వడం .బుచ్చయ్య,పేరయ్యలు పట్వారి మోసాన్ని గ్రహించి శాపనార్థాలు పెట్టడం, పుర్రెల పుట్టిన గుణం ఏమితిన్నా పోదన్నట్టు ఊరిడిచి పెట్టి పోయినంత మాత్రాన దొరల కుక్క బుద్ధి పోతదనుకోవడం పొరపాటని గ్రహించి అక్కడ వుండలేక పేరయ్య తనలక్ష్యం సొంత భూమి కొనుక్కోవడం కొరకు అవసరమైన డబ్బు సంపాదనకు దేశం పోవడంలో అందరిని కంటతడి పెట్టించారు .

ఓటు వేసే స్వేచ్ఛ వారికి వుండేది కాదని తెలిపేందుకు ఎలక్షన్‌లలో నిలుచున్న దొర మనుషులకు బలవంతంగా ఓటువేయించడం ద్వారా తెలిపారు. అగ్గికి ఆజ్యం పోయడంలో దొరలంత గొప్పొల్లులేరని నిరూపించేందుకు మాల మాదిగల మధ్య భూమి విషయంలో తగాదా సృష్టించి దానిని పెంచి పోషించి వారిలో వచ్చిన చైతన్యాన్ని దెబ్బతీస్తు సంధి కుదిర్చే ప్రయత్నం చేసిన వీరయ్యను హతమార్చడంలో చూపించారు. అణగారిన వర్గాల వారిని యింకా తొక్కేయాలనే ఉద్దేశం వారిలో వుందని ఊరి కట్టుబాటు పేరుతో శరభయ్య,శంకరమ్మలను ఊళ్ళోనుంచి వెళ్ళగొట్టడం ద్వారా నిరూపించారు. బంజెరు దొడ్డిలో కూడా దొరకో న్యాయం జనానికో న్యాయమనేది రాజయ్య మాటల్లోచెప్పించారు.

ఆ రోజుల్లో అగ్రవర్ణాల వారు అణగారిన వర్గాల వారి పట్ల చూపే చిన్న చూపు వెకిలిగా మాట్లాడే ఎతకారపు మాటలు పిల్లకు పాలిస్తున్న ఈరమ్మను చూసి కూతురులాంటి కోడలుతో బుచ్చయ్యకు రంకుఅంటగట్టిన రాజవీరుమాట్లాడిన తీరులో కనబరిచారు . భర్తకు దూరంగావున్న స్త్రీ దుస్థితి ఎలా వుండేదో ఈరమ్మ ఏడ్పులోచూపించారు.దళితుల చేతిలో ఆయుధాలున్నా ఏమిచేయలేని నిస్సహాయస్థితిని బుచ్చయ్య మాటల్లో వినపించారు . యింకా వారు కరెంటు మొఖం చూడలేదని సాయంత్రం గూటిలో దీపాలు వెలిగించారు.

తిను బండారాలు కొనుక్కుని తినే స్థోమత లేదని తెలిపేందుకు . కీసలో నువ్వులు, నూకలు పోసి ఎల్లయ్య చేత బుక్కించి చేతికి బెల్లం అంటించి నాకించారు సారు. మద్య, మాంసముల పట్ల ఎల్లయ్య విరక్తితో వున్నాడన్న విషయం తెలియజేయడానికి తాతతో బలవంతం చేయించి విఫలమయ్యారు.

మాదిగోళ్ళ పిల్లలు చదువుకుని తెలివికి వస్తే దొరలఆటలు సాగవనే విషయాన్ని, స్వార్థ బుద్ధిని రంగారావు మాటల్లో వినిపించారు .ఎల్లయ్యను చదివించాలనే మిక్కిలిపట్టుదలతో వున్న బుచ్చయ్యలో నర్సింహం మాటలతో ప్రేరణ కలిగించారు. ఆనాటికి పలక, బలపం అందుబాటులోకి రాలేదని తెలిపేందుకు తుమ్మచెక్క పలక, గుట్ట బలపం మాటలు వాడారు. బడికి పంపించాలనే ప్రయత్నంలో బుచ్చయ్య ఎంతో ఆలోచనా పరుడని తెలువడానికిషావుకారి. బాపనైన, దొర మాటలు సూదుల్లా మాదిగోళ్ళ పిల్లలు చదువుకుని తెలివికి వస్తే దొరలఆటలు సాగవనే విషయాన్ని, స్వార్థ బుద్ధిని రంగారావు మాటల్లో వినిపించారు .ఎల్లయ్యను చదివించాలనే మిక్కిలిపట్టుదలతో వున్న బుచ్చయ్యలో నర్సింహం మాటలతో ప్రేరణ కలిగించారు. ఆనాటికి పలక, బలపం అందుబాటులోకి రాలేదని తెలిపేందుకు తుమ్మచెక్క పలక, గుట్ట బలపం మాటలు వాడారు. బడికి పంపించాలనే ప్రయత్నంలో బుచ్చయ్య ఎంతో ఆలోచనా పరుడని తెలువడానికిషావుకారి. బాపనైన, దొర మాటలు సూదుల్లా గుచ్చుకునేల మాట్లాడించారు. ఆ కాలంలో బళ్ళో కూడా అంటరాని తనం ఉండేదని భూంరెడ్డి సారు మాటల్లో చూపించారు

తాత మనుమల మధ్య వుండే అనురాగం ఆప్యాయతలు తెలిపేందుకు ఎల్లయ్యకు బుచ్చయ్యతో కథలుచెప్పించారు. రెండవ తరగతికే ఎన్నో తెలివి తేటలు కలిగాయని నిరూపించేందుకు ఎల్లయ్యలో ప్రశ్నల ధోరణిని ప్రవేశ పెట్టారు. సబ్బు వాసన తెలియదని తెలువడం కొరకు మట్టితో స్నానంచేయిం చారు. సైకిలు, గడియారం,టార్చిలైటు అరుదుగా కనిపించే అపురూప వస్తువులని షావుకారి యింటి వద్ద ఎగబడి చూసిన జనంలో చూపించారుపట్టుదల వుంటే సాధించలేనిదంటు ఏమి వుండదని,కష్టాలు ఎక్కడైనా వుంటాయని యింటికి తిరిగివచ్చిన పేరయ్యద్వారా నిరూపించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా అంటరానితనం, ముట్టుడు యింకా పోలేదని మంగళి గౌరయ్య పని చేసిన విధానంలోని తేడాలను చూపించారు .డబ్బులు లేని కాలమని, పనికి బత్తెం కొలిచేవారని, క్షౌరం చేయడానికి వాడే పనిముట్లలో అప్పటికి యిప్పటికివున్న మార్పులు గమనించటానికి బుచ్చయ్య గౌరయ్య సంభాషనలో తెలిపారుచాకలి బాలవ్వ మాటల్లో మాదిగోళ్ళు అంటుకుంటే చాకలి వారికి కూడా ముట్టుడుంటుందని తెలియజేశారు. తడి బట్టలకులేని ముట్టుడు పొడి బట్టలకు వుంటుందనే మాట వారి అజ్ఞానాన్ని, అనాగరికతను తెలియజేసేందుకుచాకలి బాలవ్వతో మాట్లాడించారు.

ఎల్లయ్యలో వచ్చిన విజ్ఞానవు వెలుగును చూపించడానికి గాంధీజీ గురించి వివరించడం తండ్రిని బాపూ అని పిలిపించడం,మద్యం,మాంసం,చుట్ట తాగనని తెగేసి చెప్పడంలో అతనిపై గాంధీజీ ప్రభావంఎంతుందో అతని మాటల్లోనే చూపించారు.

జనాభా పెరుగడం పేదరికానికి ఒక కారణమని కుటుంబనియంత్రణ గురించి పెద్ద మాదిగబాలయ్య మాటల్లో చెప్పించారు. గీత కార్మికుల కష్ట నష్టాలు గౌండ్ల రాజమల్లు మాట్లాడించారు. కల్లు దొంగతనం చేస్తే శిక్షలుంటాయని తెలిపేందుకు మరిదయ్యకు శిక్ష వేయించారు.

గ్రామాల్లో చైతన్యం వచ్చిందని అది ఇందిరా గాంధీ ప్రధానిగా వున్నప్పుడని తెలిపేందుకు మాలసోమయ్య డిగ్రీ పూర్తి చేయించారు. అగ్ర కులాలైనప్పటికి విధవరాలైన స్త్రీలు హోటల్ నడిపించేవారని అందులోను అంటరానితనం వుండేదని వరమ్మతో హోటల్ నడిపించారు.ఉన్నత ఉద్యోగి అయినప్పటికి మాల,మాదిగ కులస్థులైతే యిల్లు దొరకడం గగన కుసుమం అని ఆ ఊరికి వచ్చిన ఉపాధ్యాయుడి ద్వారా ఋజువు చేశారు.

కాలేజి చదువులు చదువుతున్న ఎల్లయ్యకు కుల పీడనే ఎక్కువ అయ్యిందనుకుంటే యిప్పుడు పేరును కూడా హేళన చేస్తున్నారని ఎన్నో మానసిక సంఘర్షనలను ఎదుర్కొని అతను పేరుమార్చుకుం టాననడంలో వ్యక్తం చేశారు. ఆనందరావుగా పేరు మార్చుకున్న ఎల్లయ్యకు మొదట ఎన్నో అవమానాలు, చీవాట్లు ఎదురైనా మెల్లగాఅవే సర్దుకు పోయావని రావు అని పేరు తగిలించుకుంటే కొంతైనా కులపీడన తగ్గుతుందన్న ఆశా భావాన్ని అతనిమాటల్లో చూపించారు.

ఊరిలో ఎరుకలి వారు వుండే వారని వారి జీవన విధానం, భాష, వేషం, పంది ఎరువు వలన లాభాలు, పందుల ఎల్లయ్య మాటల్లో చూపించారు. ఎండాకాలం చేతినిండా పనిదొరకదని తెలిపేందుకు పని చేతకాని చెన్నయ్యను, చంద్రమ్మతో సరసాలాడుతు పేండ్లు చూయించారు. తాతా మనుమల వరాచికాలు చిలుక రాజయ్యతోమాట్లాడించారు.

స్వాతంత్ర్యమచ్చినప్పుడు పుట్టిన వాళ్ళిప్పుడు యువకులయ్యారని తెలుపడానికి గ్రామాల్లో కొంత చైతన్యం వచ్చి ఉద్యమాలు,ధర్నాలు, రాస్తారోకోలు చేస్తు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గంటు అల్లర్లు చేయడం వలన కాలేజికి సెలవులు ప్రకటించారని ఆనందరావుతో చెప్పిస్తు అతనిప్పుడు పి.జి మొదటిసంవ్సరం అనే విషయాన్ని తెలియజేశారు.

వలసలు వుండేవని తెలియడం కొరకు అగ్రవర్ణ కులాల యువకులు తమ ఉనికిని నిరూపించెకునేందుకు వలస వచ్చిన దళిత కుటుంబం సుబ్బారావు యింటిపై తెలంగాణ ఉద్యమం పేరుతో దాడి చేయడంలో తెలియజేశారు . కీలక నామసంవత్సరంలో వచ్చిన కరువు , కరాళ నృత్యం చేయడం యింత ఘోరమైన కరువును మొదటిసారిగాచూసిన ఆనందరావు పెద్ద చదువులు చదివినప్పటికి తండ్రి పనులల్లో సహాయం చేయడాన్ని ఎంత ఎదిగినా ఒదిగి వుండడం అనే మాటకు అసలైన అర్థాన్ని ఆనందరావులో చూపించారు .

ఉద్యమ ఫలితాలు చూపిస్తు తెలంగాణ ఉధ్యమం ఎంతో మంది విద్యార్థులను పోట్టన పెట్టుకోని అనివార్యకారణాల వలన ముగిసిపోవడం కొందరికి కడుపుకోతను మిగల్చితే, మరికొందరికి పదవులను కట్టబెట్టిందనే వాస్తవాన్ని వివరించారు

దళితులకు ఉపకులాలుండేవని, చిందుమాదిగ వారు వీరిమీదనే ఆధారపడి జీవించే వారని తెలిపేందుకు దళిత వాడంతా సంబరంలో వుంచి పెద్దమాదిగ బాలయ్యతో కులపొల్లనందిరిని పిలిపించి మనల నమ్ముకొని వచ్చిన వారికి తిండి, వుండడానికి ఏర్పాట్ల గురించి, వారి ప్రదర్శన కళల గురించి .వారిని ఆదరించి పంపించడం మన తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయమని మాట్లాడించారు. చిందు వెంకటనర్సు, రాజువేషధారి చంద్రయ్య మాటల్లో దళితుల అభివృద్ధి మా దీవెనల వల్లనే కలుగుతుందని వారి వాదనలో వినిపించారు .చంప్రోస నాటకాన్నిమనకు కళ్ళకు కట్టి చూపించారు రచయిత గారు మనకు.

గ్రామాలలో మూడ నమ్మకాలు ఎక్కువని తెలిసేందుకు మంత్రాలు, తంత్రాలు, తాయెత్తులు,జంతు బలులుదేవుళ్ళ, దయ్యాలు ,ఎత్తిపోసుడు, దించిపోసుడు వారిని వదిలిపెటిపోవని పంబాల శరభయ్య, మంత్రగాడు నర్సింగం, దేవుని వెంకటమ్మలో చూపించారు. భర్త లచ్చిరెడ్డి దెబ్బలకు వెంకటమ్మ దేవుడు దెంకపోయేలా చేసి,కలరా వ్యాదికి కారణం మంత్రగాడు నర్సింగం అని అతని పళ్ళు ఊడగొట్టించడం వలన కొంత వరకు ఈ జాడ్యాలుతగ్గు ముఖం పట్టాయని తెలియపరిచారు.

ఆనందరావుకు పట్నంలో ఉద్యోగం వచ్చినా తన వారిని మరచి పోలేదని,అతనికి తల్లిదండ్రి మీద,ఊరు మీద వున్నగౌరవ మర్యాదలుతగ్గలేదని తెలిపేందుకు ఉన్నత స్థితిలో వున్నప్పటికి పల్లెటూరి అమ్మాయితో వివాహంజరిపించడం ద్వారా తెలియజేశారు. ఊరిలో వచ్చిన మార్పును ఆనందరావు వివాహం బ్రాహ్మణులతో జరిపించడం, ఊరేగింపులో దొరకొడుకు ఊరేగింపును ఎదిరించిన యువతలో చూపించారు.

"కులాల వేళ్ళూ అనే అంశంపై ఆనందరావు డాక్టరేటు కొరకు పరిశోదన గ్రామాలను కేంద్రంగా ఎంచుకోవడంలోని ఉద్దేశాన్ని తెలిపేందుకు.

"తంగేడు చెట్టుకింద ఉయ్యాలో నింగి పుట్టిందమ్మ ఉయ్యాలో

ఈ సక్కని నింగి ఉయ్యాలో యింకెవరికిత్తునే ఉయ్యాలో

గొల్లల్ల కిత్త ఉయ్యాలో పోతావె నింగమ్మ ఉయ్యాలో

గొల్లల్ల గొర్లను ఉయ్యాలో నాకు గాయరాదు ఉయ్యాలో"

పాట ద్వారా కులాల పునాదులు గ్రామాల్లో వుంటాయని, కుల వ్యవస్థ యిప్పుడు పుట్టింది కాదని దళితుడైన చెన్నయ్యచే కులాల పాట

బిజెపి ఎంపి అర్వింద్ దూకుడుకు కళ్లెం?

పట్టుబిగించకుండా టిఆర్ఎస్ నేతల కసరత్తు

పట్టణాల్లో రెబల్స్‌కు బుజ్జగింపులు

నిజామాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పట్టు కోసం బిజెపి యత్నిస్తుండగా పోయిన పరువు నిలబెట్టుకునేందుకు టిఆర్ఎస్ తంటాలు పడాల్సి వస్తోంది. బిజెపి ఎంపి అర్వింద్ దూకుడుకు కళ్లెం వేసేందుకు మాజీ ఎంపి కవిత చాపకింద నీరులా పార్టీ నేతలకు సూచనలు చేస్తున్నారని సమాచారం. అలాగే మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో పాటు, ఎమ్మెల్యేలు కూడా ఒక్క మున్సిపాలిటీ కూడా చేజారకుండా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో జిల్లాలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయం ఆసక్తిగాకరంగా మారనుంది. ఏళ్లుగా టీఆర్ఎస్ జెండా మోసిన నేతలు కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కొందరు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇదిలావుంటే జిల్లా కార్పొరేషన్‌లో సరైన అభివృద్ధి జరగలేదని టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు ఏఎస్ పోశెట్టి నిరసన వ్యక్తం చేయడం సంచలనంగా మారింది. రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ అసలు బాగోలేదని, ప్రభుత్వం ఏటా నిజామాబాద్‌కు విడుదల చేస్తున్నా రూ. 100 కోట్లను ఏం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రోడ్ల విస్తరణ లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రం అవుతున్నాయని, కాలనీల్లో అభివృద్ధి అనేది ఎక్కడా కూడా కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో సరైన ఆట స్థలాలు పార్కులు, పార్కింగ్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అవినీతి పరులకు ఓటు వేయకుండా ప్రజల కోసం పోరాడే అభ్యర్థులకు, పని చేసే యువకులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు అధికార పార్టీకి మింగుడు పడడం లేదు. ఇక కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో ఒకే వార్డులో తాజా, మాజీ చైర్మన్‌ల పోరు సాగనుంది. పట్టణంలోని 43వ వార్డులో తాజా మాజీ చైర్ పర్సన్ పిప్పిరి సుష్మ టీఆర్ఎస్ తరపున శుక్రవారం నామినేషన్ వేశారు. అదే వార్డు నుంచి మాజీ చైర్మన్ చీల ప్రభాకర్ కోడలు చీల రచన నామినేషన్ వేశారు. అయితే ఈ వార్డులో మాజీల పోరు సాగనుంది. ఇద్దరు అభ్యర్థులు వైశ్య వర్గానికి చెందిన వారు. ఈ వార్డులో వైశ్యుల ఓట్లు ఎక్కువగా ఉంటాయి. ఇద్దరు గెలుపు ధీమాలో ఉన్నారు. అందరూ ఊహించినట్లుగానే ఎల్లారెడ్డి మున్సిపల్ టికెట్లలో రవీందర్‌రెడ్డి వర్గానికి మొండి చెయ్యే ఎదురైంది. తమ పార్టీలో టికెట్ లభించని ఆయన వర్గీయులు కాంగ్రెస్‌లో చేరారు. శాసనమండలి మాజీ ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ, టీపీసీసీ డెలిగేట్ ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి ఒ÷-డడెపల్లి సుభాష్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, మంచిర్యాల విద్యాసాగర్, ముస్త్యాల రాజు, ప్యాలాల రాములు, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీఖ్ కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ గయాజుద్దీన్ కూడా షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్మ శ్రీకాంత్, గజ్జల రామచందర్ టీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలు మారిన నేతలకు రెండు పార్టీలలో టికెట్లు లభించాయి. కొత్తగా చేరిన పార్టీలతో పాటు తమ పార్టీల నుంచి కూడా వీరిలో పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తగా పార్టీలలో చేరిన వారితో పాటు గతంలో పార్టీ టికెట్లు ఆశించిన నాయకులు కూడా తమ నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం. దీంతో రెండు పార్టీలలో దాదాపు అన్ని స్థానాలలో రెబెల్స్ తాకిడి ఎక్కువైంది. ఇక బీజేపీ కూడా మున్సిపాలిటీలో 10 స్థానాలకు అభ్యర్థులను పోటీలో దించింది. జనరల్ మహిళలకు కేటాయించిన 8, 5 వార్డులకు బీజేపీ పోటీ చేయడం లేదు. మారిన సమీకరణాల నేపథ్యంలో ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఇన్నాళ్లూ తాము విబేధించిన వారితోనే కలిసి పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడటం గందరగోళంగా మారింది. టీఆర్ఎస్ నుంచి మున్సిపల్ చైర్మన్ రేసులో ఉన్న కుడుముల సత్యనారాయణ 7వ వార్డు నుంచి పోటీ చేస్తున్నారు. కాగా చైర్మన్ స్థానాన్ని ఆశిస్తూ కొత్తగా పార్టీలో చేరిన పద్మ శ్రీకాంత్ 10వ వార్డు నుంచి తన నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న గయాజుద్దీన్ 12వ వార్డు నుంచి పోటీ చేస్తున్నారు. చైర్మన్ రేస్‌లో ఉన్న టీఆర్ఎస్ నాయకులు ఇద్దరికి తమ పార్టీ నుంచే రెబెల్స్ పోటు తప్పడం లేదు. నామినేషన్లు దాఖలు చేసిన తమ పార్టీ వారిని ఇతరులను విత్‌డ్రాలు చేయించేందుకు నేతలు పావులు కదుపుతున్నారు.

పట్టణాల్లో పట్టుకోసం గులాబీనేతలు పాచికలు

బి ఫారాల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు

రెబల్స్‌ను బుజ్జగించే పనిలో స్థానిక నేతలు

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): పట్టణాల్లో మున్సిపల్ రాజకీయాలు వేడెక్కాయి. తొలిదశ నామినేషన్ల పర్వం ముగియడంతో ఇక ఆశావహులు బి ఫారాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు నామినేషన్ల పరిశీలన జరుగుతుండగా పోటీ అభ్యర్థులను దారికి తెచ్చుకునే యత్నంలో నేతలు ఉన్నారు. ఈ దశలో గెలుపు గుర్రాలను తమవైపు తిప్పుకుని, టిఆర్ఎస్ మద్దుత ఇవ్వడం ద్వారా గ్రామాల్లోగులాబీ జెండాలు ఎగురేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. నామినేషన్ల పరిశీలన ముగియడంతో బరిలో ఉన్న అభ్యర్థులతో గులాబీనేతలు జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఆదేశాలతో నేతలు ఈ పనిలో నిమగ్నం అయ్యారు. మునిసిపల్ ఎన్నికల్లో తమకు ఎదురులేదని అధికార టీఆర్ఎస్ చెబుతున్నప్పటికీ.. అన్ని చోట్లా కేక్ వాక్ సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లోనైనా గట్టిపోటీ తప్పదని పార్టీ నేతలు అంగీకరిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్న మునిసిపాలిటీల్లో టీఆర్ఎస్‌కు గట్టి పోటీ అనివార్యమని వారు చెబుతున్నారు. పార్టీ అంతర్గత సర్వేల్లోనూ ఇదే తేలిందని, అందుకే అధిష్ఠానం రెబెల్స్ విషయంలో కలవరపడుతోందని అంటున్నారు. రాష్ట్ర స్థాయిలో అధికార పార్టీగా టీఆర్ఎస్‌కి ఈ ఎన్నికల్లో సానుకూలత ఉన్నప్పటికీ, దాదాపు సగం మునిసిపాలిటీల్లో గెలుపు కోసం ఎంతో కొంత శ్రమించక తప్పదని పార్టీ ముఖ్యులు పలువురు అభిప్రాయపడుతున్నారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక నియోజకవర్గాన్ని వదిలిపెట్టకుండా, స్థానికంగా ఉండి రాజకీయంగా చురుగ్గా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఉన్న చోట్ల మునిసిపల్ పోరు ఆసక్తిగా మారిందని చెబుతున్నారు.

మరోవైపు పట్టణాల్లో పలు వార్డుల్లో నేతలు తమవంతుగా ఏకగ్రీవం చేయించే పనిలో పడ్డారు. పార్టీలో తమపట్టు పెంచుకునేందుకు యత్నాలు మొదలు పెట్టారు. రాజకీయాలను పక్కన పెట్టి ప్రజలను ఏకం చేసే క్రమంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపుతున్నారు. ఎన్నికల పేరుతో కులం, మతం, వర్గంగా విడిపోయే అవకాశం ఇవ్వకుండా పట్టణాభివృద్ధి అనే ఏకైక నినాదంతో ఒక్కటవుతున్నారు. అందరూ కలిసి చర్చించుకొని ఏకగ్రీవంగా వార్డులను ఎన్నుకొని ఐక్యమత్యాన్ని చాటుదామన్న నినాదంతో ముందుకు సాగుతున్నారు. మొత్తంగా గులాబీ దళాలు చురుకుగా పనిచేస్తున్నాయి. ఏకగ్రీవాలతో ఎన్నికలను తప్పించాలని చూస్తున్నాయి. అవసరమైతే ఇరువర్గాలను రాజీ చేసే పనిలో ఉన్నాయి. అందుకే పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని, ఒక్క చోట ఓడిపోయినా పదవులు ఊడతాయని మంత్రులకు సీఎం కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారని అంటున్నారు. అదే సమయంలో రెబెల్స్ బరిలో లేకుండా చూసుకోవాలని, పార్టీ గీత దాటితే సీరియస్ యాక్షన్ తీసుకుంటామంటూ ఆయన ప్రకటన చేశారని చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్ ఎల్పీలో విలీనమైన 12 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజక వర్గాల్లో వారికి, టీఆర్ఎస్ నేతలకు పూర్తి స్థాయిలో పొసగటంలేదు. ఆ ప్రాంతాల్లోని మునిసిపల్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. వాస్తవానికి అధికార పార్టీగా టీఆర్ఎస్ మునిసిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా చక్రం తిప్పే వీలుంటుంది. ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని టీఆర్ఎస్‌లో చేర్చుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. అయితే ఇందుకోసం శిబిరాలు నిర్వహించాల్సి వస్తుంది. ఇతర పార్టీల నుంచి గెలిచిన వారికి ఎన్నికల్లో వారు ఖర్చు చేసిన మొత్తంతోపాటు, అదనంగా కొంత చెల్లించాల్సి ఉంటుంది.

సంతోష్ పర్యావరణ పట్ల తీసుకున్న చొరవ అమోఘం

- గ్రీన్ చాలెంజ్‌లో మొక్కలు నాటిన చాముండేశ్వరీనాథ్

హైదరాబాద్, జనవరి11(ఆర్ఎన్ఎ) : రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ దిగ్విజయంగా కొనసాగుతోంది. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా నర్సాపూర్ ఎంపీ రఘురాం కృష్ణంరాజు విసిరిన సవాలును మాజీ క్రికెటర్, పారిశ్రామికవేత్త చాముండేశ్వరీనాథ్ స్వీకరించారు. శనివారం ఆయన గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్‌లోని తన నివాసంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీ సంతోష్ పర్యావరణం పట్ల తీసుకున్న చొరవ అమోఘం. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన వస్తోందని ఆయన తెలిపారు. ప్రోగ్రాం ఇంకా విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సాహసోపేత కార్యక్రమంతో సంతోష్ చరిత్రలో నిలిచిపోతారని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరీనాథ్.. మరో ముగ్గురికి గ్రీన్ చాలెంజ్ విసిరారు. వారిలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు తల్లి విజయ, సినీ నటుడు నాగ చైతన్య, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ చాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ, హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు సుబ్బరాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన చాముండేశ్వరి నాథ్

నౌకాదళ చరిత్రలో సరికొత్త అధ్యాయం

ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండ్

పనాజి,జనవరి11(ఆర్ఎన్ఎ): భారత నౌకాదళ చరిత్రలో ఇవాళ కొత్త అధ్యాయం మొదలైంది.

యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై.. నావెల్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను విజయవంతంగా ల్యాండ్ చేశారు. ఎల్‌సీఏను డీఆర్‌డీవో తయారు చేసింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన యుద్ధ విమానాన్ని.. విక్రమాదిత్యపై దించడం ఇదే తొలిసారి. ఈ ఫైటర్ విమానాన్ని డెవలప్ చేసేందుకు ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ తీవ్రంగా కృషి చేస్తున్నది.

గోవాలోని షోర్ బేస్డ్ టెస్ట్ ఫెసిలిటీ సెంటర్‌లో ఈ పరీక్ష కొనసాగింది. విక్రమాదిత్యపై ల్యాండ్ అయ్యేందుకు పైలట్లు కొన్ని వంద గంటల పాటు ట్రైనింగ్ చేశారు.

అరెస్టెడ్ ల్యాండింగ్ సక్సెస్ కావడంతో భారత నౌకాదళంలో ఆనందోత్సహాలు వెల్లువెత్తాయి. ఈ మైలురాయితో భారత నౌకాదళానికి కావాల్సిన ట్విన్ ఇంజిన్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను డెవలప్ చేసే దిశగా అడుగులు వేస్తామని ఇండియన్ నేవీ ప్రతినిధి తన ట్విట్టర్‌లో తెలిపారు. లైట్ కంబాట్ విమానానికి కమాండర్ జైదీప్ మాలంకర్ పైలట్‌గా చేశారు. భారత యుద్ధ విమాన అభివృద్ధి పక్రియకు ఇదో గొప్ప సందర్భమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

సంక్రాంతి పేరుతో ఛార్జీల మోత

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పేరుతో తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను అధిక ఛార్జీల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నాయి. సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల్లోని సొంత గ్రామాలకు ప్రజలు చేరుకునేందుకు ముందస్తుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకుంటున్నా బాదుడు తప్పడం లేదు. ఈనెల 11 నుంచి 16 వరకు విద్యాశాఖ పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించింది. ఈనేపథ్యంలో విద్యార్థులు సహా హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు, వృత్తులతో స్థిరపడిన వేలాది మంది సంక్రాంతి పండుగకు సొంత వూళ్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుండగా విపరీతమైన రద్దీ పెరిగి టిక్కెట్లు దొరకని పరిస్థితి నెలకొంది. ప్రత్యేక బస్సుల పేరుతో డొక్కు బస్సులు నడుపుతూ ప్రస్తుత టిక్కెట్ ధరపై రెండు నుంచి నాలుగు రెట్లు వరకు ఛార్జీలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. అయితే రెండు రాష్ట్రాల ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటితోపాటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పెద్దసంఖ్యలో నడుస్తున్నాయి. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటున్న ప్రయాణికులు వాటి ధరలు చూసి బావురుమంటున్నారు. పండుగకు ఇంటికెళ్లి రావటానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఎంత ఖర్చయినా తప్పదని టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి ముగిసిన తర్వాత 15, 16 తేదీల్లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. ఆరెండు రోజుల్లో తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ముందస్తుగా అనేక మంది రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. అయితే ఆర్టీసీ టిక్కెట్ ధరలకు రెట్టింపుగా ప్రైవేట్ ట్రావెల్స్ ధరలు ఉంటున్నాయి.

నేడు ఇంటర్ గురుకుల ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహిస్తున్న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 2020 - 21 గాను ప్రవేశ పరీక్ష ఈనెల 12న నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల ప్రాంతీయ సమన్వయ అధికారి కొత్తూరి లక్ష్మయ్య ఒక ప్రకనటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం890 మంది విద్యార్థులకు ఉట్నూర్ లాల్‌టికిడీ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, ఆసిఫాబాద్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, ఆదిలాబాద్ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు తమ హాల్‌టికెట్లు తీసుకొని ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

19న పల్స్ పోలియోకు ఏర్పాట్లు

నిజామాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): ఈ నెల 19న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులతో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై సూచనలు చేశారు.

ప్రతి సంవత్సరంలాగే అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని అధికారులను ఆదేశించారు. అన్ని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రజలు ఉండే ఇతర ప్రాంతాల ు, ఇటుక బట్టీలు ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారం గుర్తించిన ప్రతి చోటా పోలియో చుక్కలు వేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 19 తర్వాత ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయని వారికి వేసి నూరు శాతం లక్ష్యం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయవంతం చేయడానికి స్త్రీ శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ, రవాణాశాఖ, మెప్మా, డీఆర్డీవో, ఆర్టీసీ ఇతర శాఖలన్నీ సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

నారావారిపల్లెలో చంద్రబాబు సంక్రాంతి

తిరుపతి,జనవరి11(ఆర్ఎన్ఎ): మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ యేడు కూడా సంక్రాంతి సంబరాలను తన స్వగ్రామంనారావారి పల్లెలో జరుపుకోనున్నారు. ఈ మేరకు అధికారులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. 12, 13 తేదీల్లో నారా, నందమూరి కుటుంబసభ్యులు పలువురు ఇక్కడికి తరలిరానున్నారు. పండుగ నేపథ్యంలో స్వగ్రామమైన నారావారిపల్లికి బాబు కుటుంబ సమేతంగా రానున్నారు. మొత్తం మూడ్రోజులపాటు ఆయన జిల్లాలోనే ప్రత్యేకించి స్వగ్రామం నారావారిపల్లిలోనే ఉండనున్నారు. 14న స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి వేడుకలు జరుపుకొంటారు. 15న నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. వినతులు స్వీకరిస్తారు. నారావారిపల్లికి వెళ్లే రహదారులను తీర్చిదిద్దుతున్నారు. చంద్రబాబు బంధువర్గం గ్రామానికి చేరుకొని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోళ్లు

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

రంగారెడ్డి,జనవరి11(ఆర్ఎన్ఎ): తాండూరు పట్టణంలో మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు జోరుగా సాగుతున్నది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేసింది.

ప్రభుత్వం కందుల కొనుగోలు ప్రారంభించింది. మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం కందుల కొనుగోళ్లు చేపడుతుంది. దళారులు లేకుండా ప్రభుత్వం ఆన్ లైన్ విధానం తీసుకొచ్చి రైతుల కష్టాలు తీర్చింది. దీంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా రైతాంగంలో మరింత భరోసా కల్పించడం, దళారుల ఆగడాలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా సర్కారు నడుం బిగించింది. దళారుల నుంచి రైతులను కాపాడాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మార్క్ ఫెడ్ కందుల కొనుగోలు ప్రారంభించింది. మార్క్‌ఫెడ్ ద్వారా కందులు అమ్మాలంటే 12 శాతం కంటే తేమ మించరాదు. అలాగే ఒక్కొక్క రైతు 25 క్వింటాళ్ల వరకు అమ్ముకోవచ్చు. రైతుల పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను కొనుగోలు కేంద్రం అందించి విక్రయించుకోవాలి. ఈ కందులు అమ్మాలంటే అగ్రికల్చర్, వీఆర్వోల అనుమతి ఉండాలి. రైతులు కందులను అమ్మిన 15 రోజుల్లో డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

అయోమయంగా తప్పుకున్న రాజేందర్

రిజర్వేషన్‌తో పోటీ చేసే ఛాన్స్ మిస్

జగిత్యాల,జనవరి11(ఆర్ఎన్ఎ): మూడుసార్లు వరుసగా గెలిచిన కౌన్సిలర్ రాజేందర్ ప్రస్తుతం రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో ఛాన్స్ మిస్ అయింది. కాంగ్రెస్ నుంచి మూడుసార్లు గెలుపొంది రాజేందర్ జగిత్యాల మున్సిపాలిటీలో మంచిపేరు సంపాదించుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. సతీమణిని పోటీలో నిలుపుదామనుకున్నా ప్రభుత్వ ఉపాధ్యాయురాలుకావడంతో పోటీకి నిలిపే అవకాశం లేకుండాపోయింది. ప్రస్తుత ఎన్నికల్లో పోటీలో నిలబడలేదు. 46వ వార్డుకు చెందిన గాజుల రాజేందర్ గతంలో 22వ వార్డు ప్రస్తుతం 46వ వార్డులో 2005, 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి వరుసగా కౌన్సిలర్‌గా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ప్రస్తుతం బీసీ మహిళ కావడంతో ఆ వార్డులో పలుకుబడి ఉండడంతో ఆయనకు పోటీచేసే అవకాశం లేకుండా పోయింది. ఆయన తరఫున బంధువులు పోటీలో ఉన్నారు. ఇకపోతే మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీలో బీఫారాల విషయంలో అయోమయం ఏర్పడింది. వీటిని తానే ఇస్తానని మాజీ ఎమ్మెల్యే రాములు ప్రకటించడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న జువ్వాడి నర్సింగరావు వర్గీయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేశారనే ఉద్దేశంతో రాములును పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల గాంధీభవన్‌లో మాజీ ఎంపీ మధుయాష్కీతోపాటు మరికొందరు ముఖ్య నేతలతో రాములు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సస్పెన్షన్ ఎత్తివేయడంతోపాటు మెట్‌పల్లి మున్సిపల్‌కు సంబంధించిన కాంగ్రెస్ బీఫారాలు రామ్‌లుకే ఇవ్వాలని పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. మరోవైపు శుక్రవారం పట్టణానికి వచ్చిన రామ్‌లు బీఫారాలు తానే ఇస్తానని ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేసిన అభ్యరులకు గుబులు పట్టుకుంది. ఇదిలా ఉంటే రాములు ప్రకటనతో ఖంగుతిన్న పలువురు అభ్యర్థులు దీనిపై జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుకు ఫోన్లు చేసి ఆరా తీశారు. పార్టీ నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న తామే బీఫారాలు ఇస్తామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని ఇరువురు భరోసా ఇచ్చినట్లు వారు పేర్కొంటున్నారు. మొత్తానికి స్థానిక కాంగ్రెస్‌లో కలకలం రేపిన రాములు వ్యవహారం రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్నది ఆసక్తికరంగా మారింది.

అక్రమ నిర్మాణాలపై కొరడా!

- కేరళలోని మరాడు మున్సిపాలిటీలో అక్రమ బిల్డింగ్‌లు కూల్చివేత

- సుప్రీం ఆదేశాలతో కదిలిన అధికారులు

- రెండురోజుల పాటు కూల్చివేతల పర్వం

తిరువనంతపురం, జనవరి11(ఆర్ఎన్ఎ) : అక్రమ నిర్మాణాలపై కేరళ అధికారులు కొరడా ఝుళిపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేరళలోని మరాడు మున్సిపాల్టీలో అక్రమంగా నిర్మించిన అయిదు భారీ అపార్ట్‌మెంట్లను కూల్చివేత చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మరాడు ప్లాంట్లను ధ్వంసం చేశారు. హోలీ ఫెయిత్ బిల్డింగ్‌ను పేలుడు పదార్థాలతో కూల్చేశారు. రెండు రోజుల పాటు కూల్చివేతలు కొనసాగనున్నాయి. ఆదివారం కూడా మరికొన్ని బిల్డింగ్‌ను కూల్చివేయనున్నారు. కొచ్చి తీర ప్రాంతంలో అక్రమంగా బిల్డింగ్‌లు నిర్మించినట్లు మరాడు సంస్థపై ఆరోపణలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. కేరళ కోస్టల్ రెగ్యులేషన్ జోన్ ఆధ్వర్యంలో కూల్చివేత పక్రియ కొనసాగింది. సుమారు 800 కిలోల పేలుడు పదార్థాలు వాడినట్లు తెలుస్తోంది. కూల్చివేతల సందర్భంగా కాంప్లెక్స్ ల చుట్టు పక్కల ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. మొత్తం 343 ఫ్లాంట్లు 240ఫ్యామిలీలు కాంప్లెక్స్‌లలో ఉంటున్నాయి. పక్కన ఉన్న బిల్డింగ్ లకు ఎలాంటి నష్టం రాకుండా ఈ కాంప్లెక్స్‌ను కూల్చివేశారు. ముందు జాగ్రత్తగా 200 మీటర్ల ప్రాంతంలో నివసించే ప్రజలు బయటకు వెళ్లాలని కోరారు. ఆల్ఫా సెరీన్ బిల్డింగ్‌ను కూడా కూల్చనున్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత.. రియల్ ఎస్టేట్ మాఫియాకు చెంప పెట్టు అని భావిస్తున్నారు. పర్యావరణ ఆంక్షలను ఉల్లంఘించి.. బిల్డింగ్‌ను నిర్మిస్తే ఇలాగే ఉంటుందన్నారు. కేరళ ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమే కూల్చివేత జరగాలని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. అయితే ఆ అపార్ట్‌మెంట్లలోని ప్రతి ఒక ప్లాంట్ ఓనర్‌కు 25 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. బిల్డింగ్‌ల కూల్చివేత, నష్టపరిహారం అందే విధంగా చూసుకునేందుకు ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని కోర్టు కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరాడు అపార్ట్‌మెంట్లలో ఉంటున్న సుమారు 400 కుటుంబాలు ఇటీవలే రాష్ట్రపతిని కూడా ఆశ్రయించారు. బిల్డింగ్‌లను కూల్చివేసేందుకు వస్తున్న మున్సిపాల్టీ అధికారులను అడ్డుకోవాలని వారు రాష్ట్రపతిని కోర